ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

40817

ఆగస్టు 09, 2009



జాతి గీతిక...
దేశ ప్రతీక...

హ్యాపీబర్త్‌డే

(౨౦౦౯ ఆగస్టు ౯ నుంచి ౨౦౦౯ ఆగసు ౧5 వరకు)

ఇ. అన్వేష్
2సం॥, ఆగస్టు-10
జ్యోతి-ముత్యంరావు
కరీంనగర్

లక్కీ
4సం॥,ఆగస్టు-2005
మమత-జంగయ్య
ఆరుట్ల-రంగారెడ్డి

సిహెచ్. నవ్య(సుకన్య)
10సం॥, ఆగస్టు-15
వెంకటరమణ-ఎల్లయ్య
పినిరెడ్డిగూడెం-ఖమ్మం

వీణ-లహరి
ఆగస్టు
రత్న-చక్రి
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

డి. నవీన్‌కుమార్
4సం॥, ఆగస్టు-2005
గణ-వెంకటయ్య
గుండుమాల్-మ॥నగర్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

అన్నం పెట్టే రైతన్న కోసం...



కష్టనష్టాలు ఎన్నున్నా లాభనష్టాలు లెక్కచేయనివాడు... దుక్కి చేయడం తప్ప సుఖమెరుగనివాడు... ఎండావానలకు వెరవనివాడు... అలకలూ అరమరికలూ తెలియనివాడూ... తన స్వేదానికి ఏనాడూ ఖరీదు అడగనివాడు... కాయకష్టం ఎంత చేసినా అలుపూ ఆయాసం ప్రదర్శించనివాడు... దేశానికి నాలుగు మెతుకులు పెట్టి అదే తనకు ఆనందం, పరమానందం అని పరవశించేవాడూ....

ప్రాణం ఇవ్వడం తప్ప తీయనివాడు... వరదకు చేను కొట్టుకుపోతే పశువుకు కాస్త గడ్డయినా మిగిలింది కాదని బాధపడేవాడు... మూగజీవాల్లో తండ్రినో, తోబుట్టువునో చూసుకుంటూ ప్రేమతో సాకేవాడూ... ఎండ తీవ్రతకి చేను సోలిపోతే విలవిల్లాడేవాడు... మొక్క మోడువారితే ముఖం మాడ్చుకునేవాడు... లేగదూడను సందిట పొదువుకొని అమ్మలా నాన్నలా ముద్దులు కురిపించేవాడు... నేలతల్లికి నిరతం దుక్కి జడ అల్లి, పచ్చ చీర పొదివి, పూల రవికె తొడిగి పండగ చేసుకునేవాడూ... ప్రకృతి సేవలో పరంపరంగా తరిస్తున్నవాడూ, తపిస్తున్నవాడూ...

ఎంత మాటన్నాడో చూశారా?

"మా తండ్రులు మాకు చారెడు భూమిచ్చారు. మేం మా పిల్లలకు ఇంత విషం ఇయ్యాలా?"

తన పిల్లలకు విషం ఇవ్వాలా అని అడిగాడంటే- అతడి మనసు ఎంత గాయపడిందో! ఎంత ఆవేదనకు గురయిందో...! రైతు ఏనాడైనా వ్యవసాయాన్ని 'వ్యయ'సాయంగా చూశాడా? నష్టానికి కుంగిపోయి, లాభానికి పొంగిపోయి నేలను విడిచి సాము చేశాడా? రియల్ ఎస్టేటు భల్లూకాలూ, సెజ్‌ల గద్దలూ రంగురంగుల ఊరింపులతో భూమిచుట్టూ చక్కెర్లు కొట్టినా మనిషి చలించాడా? సేద్యం గురించి తప్ప సొమ్ము గురించి ఎప్పుడైనా చర్చించాడా?

అతడు అర్ధశాస్త్రాలూ, వ్యాపార చిట్కాలూ చదవలేదు. లక్షలూ కోట్లూ కూడేయడం గురించి ఆలోచించలేదు. అతడి ప్రపంచం విశాలం, బతుకు జ్ఞానం అపారం. సాయమొచ్చే ఎద్దూ, అరకన వాలే పిట్టా, చివుర్లెత్తే మొక్కా, నీడనిచ్చే చెట్టూ, తోడు వచ్చే కూలీ, తోటకొచ్చే మాలీ... ఇంకా వివిధ పనుల్లో సహకరించే సమస్త వృత్తుల స్నేహగాళ్లూ... అతడి బిడ్డలు. వారిది తరతరాల సహజీవనంలో పెనవేసుకున్న అనుబంధం! కంపెనీ రాబందులు కమతాలపై వాలితే ఈ సంబంధాలన్నీ చెల్లాచెదురు అవుతాయి. లాభంనష్టం లెక్కలు మాత్రమే మిగిలి, అనుబంధాలన్నీ అదృశ్యమవుతాయి.

అందుకనే- రైతుకింత ఆవేదన! ఆక్రందన!!

రైతన్నా... ఈ బంధాలూ అనుబంధాలూ మనసులేని వాళ్లకు అర్థం కావు. కన్నీళ్లూ, వెక్కిళ్లూ వాళ్లను కదిలించలేవు. నిట్రాయికి నిలేసిన చర్నాకోలను చేలగట్లపై కాపలా పెట్టు. మూలన ఉన్న ములకర్రకు చురుకెక్కించు. కొడవలికి కక్కుళ్లు కొయ్యి. పొలం గట్టున అరకను నిలెయ్యి. ఎలపటి దాపటి ఎద్దులు నీ వెనకన నిలుస్తాయి. కోడెగిత్త రంకెలు, కోడిపుంజు మేల్కొలుపులూ నీ ప్రతిఘటనకు పతాకాలవుతాయి. ఎదిరించి నడిస్తే కంపెనీ రాబందులూ, సహకార కామందులూ తోక ముడవడం ఖాయం!

✶

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్ పువ్వుల్	...	3
స్ఫూర్తి	...	4
తెలుసుకుందామా	...	6
చిన్నకథ	...	7
సీరియల్	...	10
అట్టమీది కథ	...	14
కవిత్వమ్	...	18
క్రైమ్ కథ	...	19
చూద్దామా	...	20
తెల్సా	...	23

ఇంకా...

సమ్‌థింగ్ స్పెషల్ ... 8
టమాటా కబుర్లు

బాలనేస్తాలు ... 12
ఫొటో ఫ్రేమ్ చేద్దామా

రుచి ... 17
కాకరకాయల వేపుడు

కొత్త పుస్తకాలు... 24
చక్కటి కథా సంపుటి



మహాభాగ్యనగరం సంగతులు తెల్సుకున్నాం

జులై ఆఖరు ఆదివారం స్నేహ అట్టమీది కథగా రాజగోపాల్ అందించిన మహాభాగ్యనగరం అపూర్వ సంగతులను మాకు తెలియజేసింది. కొన్ని ముఖ్య సంఘటనలు పట్టిక రూపంలో ఇవ్వడం బావుంది. మనం రోజంతా కళ్ల శుభ్రత కోసం ఏడుస్తూనే ఉంటామని తెల్సా ద్వారా గ్రహించాం. ఆర్టు అదిరెనులే చిత్రాలు నిజంగా ఆహా అనిపించేలా ఆకర్షింపచేశాయి. కొవ్వు తక్కువ పండు సపోటా విషయాలను చదువుతుంటే రోజూ వీలయినన్ని సపోటాలు తినేయాలనిపించింది. గిన్నిస్ బుక్‌లో స్థానం కైవసం చేసుకున్న 'ఖగేంద్ర థాపమగర్'కు మేం కూడా శుభాకాంక్షలు అందిస్తున్నాం. సలహాలు శీర్షిక ద్వారా జి.ఎల్. నరసింహారావు గారి సూచనలు ఆయా సమస్యలు వున్నవారికే కాక న్యాయసంబంధమైన అనేక విషయాల పట్ల మాకు అవగాహన కలుగుతోంది. స్వామి 'దుష్పటి దొంగ' కథ బావుంది. సినిమాకబుర్లు ఎంతో ఆసక్తికరంగా చదివాం. ఏఎన్నార్ చేత పేమెంట్ విషయంలో భేష్ అనిపించుకున్నారంటే అంతకుమించిన కాంప్లిమెంట్ వుంటుందా? ఈసారి ఎన్నికల కోసం ముందుగా ఆకర్ష వంటి పథకాలు రాజా వారికే చెల్లింది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

కవర్ స్టోరీ బాగుంది

చారిత్రాత్మకమైన మహాభాగ్యనగరం గురించి చాలా విషయాలు తెలుసుకున్నాం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కట్టడాలకు నిలయం హైదరాబాద్ నగరం. 650 చదరపు కిలోమీటర్ల పరిధిలో 67 లక్షల జనాభా కలిగిన హైదరాబాద్ నగరం ముంబాయి, బెంగుళూరు, చెన్నై నగరాలతో సమానంగా పెరిగింది. ఏ ప్రాంతానికైనా చరిత్ర అవసరం. క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం నుండి హైదరాబాద్ నగర చరిత్రను కొంత తెలుసుకున్నాం. అదే సమయంలో నిజాం ప్రభువుల దుష్టపాలన వల్ల ప్రజలు అనుభవించిన బాధలు కళ్లకు కట్టినట్లు వివరిస్తే బాగుండేది. మిత్రులు సయ్యద్ నజీర్ అహ్మద్ రచన 'చిరస్మరణీయులు' పుస్తక పరిచయం బాగుంది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

ఆర్టు నిజంగానే అదిరింది

బెల్లంగడ్డలను ఎగరవేస్తూ ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే ముఖ్యమంత్రికి ఎదురుదెబ్బ తప్పక తగులుతుంది. సపోటా పండుకు మేమూ సపోర్టు ఇస్తాము. ఖగేంద్రుడు ఆకాశానికి ఎగిరి గిన్నిస్ పుస్తకం తప్పక ఎక్కుతాడు. గ్రేటర్ భాగ్యనగరం మత రక్కసుల కరవాలాల పాల పడకుండా దుష్టులకు దూరంగా వుండాలి. చాక్లెట్ తయారీ రుచిగా, తీయగా వుంది. కవర్ పేజీ ఆర్టు నిజంగానే అదిరింది. సోషలిజం విద్యార్థులకు రంగాచార్యుల వారి పుస్తకం ఆదర్శమవుతుంది. జోన్‌పూర్ వైభవం ముస్లిముల వైభవానికి ప్రతీక. చారిత్రక అవశేషాలను భద్రపరచవలసిన తీరు బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

'అలీబాబా...' ఎన్నిసార్లైనా చదివిస్తుంది

ప్రతివారం మీరు చిన్నారులకు హ్యాపీబర్త్‌డే కానుకగా అందిస్తున్నందుకు ఎంతో ఆనందంగా వుంది. అట్టచివర అలీబాబా 40 దొంగలు ఎన్నిసార్లు చదివినా మరో భారతంలా చదివింప చేస్తుంది. ఆ కథకున్న బలం అలాంటిది. దుప్పటి దొంగ కథ చాలా బాగుంది. జోక్సన్నీ కడుపుబ్బ నవ్వించాయంటే బాగున్నట్లే కదా! న్యాయ సలహాలు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. మహా భాగ్యనగరం గురించి ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాం. ఖగేంద్ర థాపమగర్ గురించి తెసుకున్నాం. సపోటాలోని పోషక విలువల గురించి తెలుసుకున్నాం.

పక్కి బాలకృష్ణారావు,
విజయనగరం.



ఆకట్టుకున్న జౌన్‌పూర్

జౌన్‌పూర్ విశేషాలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అక్కడి కట్టడాలను చూస్తుంటే ఎంత పురాతనమైనవో అర్థమౌతుంది. సినిమా కబుర్లలో నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ చెప్పిన కబుర్లు మమ్మల్ని బాగా ఆకట్టుకున్నాయి. కలర్ పేజీలోని మొక్కల ఆర్టు చాలా బాగుంది. భాగ్యనగరం విశేషాలు చాలా తెలుసుకున్నాం. తెల్సా శీర్షికలో ఆరుగంటల పాలన గురించి తెలిశాక ఆశ్చర్యమేసింది. చాక్లెట్, ఆలూ టమాటా కూర బాగున్నాయి. దుప్పటి దొంగ కథ బాగుంది.

ఎస్.భాస్కరరావు, విశాఖ.

★



నవ్వుల్ - పువ్వుల్

వయసు

కొడుకు : నాన్నా! నాకు ఇప్పుడు కారు నడిపే వయసు వచ్చింది కదా. మరి కారు ఎందుకివ్వవు?

తండ్రి : చిట్టి తండ్రీ! నా కారుకు అంత వయసు రాలేదు. అందుకే ఇవ్వట్లా.

వినకుండా

మనోజ్ : ఈ టెలిఫోన్ తీగలు అంత ఎత్తులో ఎందుకు పెడతారో నీకేమైనా తెల్సా!

వంశీ : అది కూడా తెలీకపోతే వేస్ట్. ఇద్దరు మాట్లాడుకున్న మాటలను మూడోవాడు వినకుండా.

నలుపు

తల్లి కాకి: చంటీ! ఎండలోకి వెళ్లమాకురా!

పిల్ల కాకి: ఏం ఎందుకని?

తల్లి కాకి: నల్లగా అవుతావు కన్నా.

తోక ముడి

రాజేష్ : మోహన్, ఏనుగు సూది బెజ్జంలోంచి దూరి రాకుండా ఏం చేయాలి?

మోహన్ : సింపుల్. దాని తోక దగ్గర ముడి వేస్తే చాలు.

కథా నిలయం
శ్రీకాకుళం

స్నానం

(ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటున్నారు)

మొదటివాడు: నేను వేసవిలో అయితే పదిసార్లు, చలికాలంలో అయితే నాలుగైదు సార్లు స్నానం చేస్తాను.

రెండవవాడు: ఆశ్చర్యంగా వుందే! రోజుకి పదిసార్లు స్నానం చేస్తావా?

మొదటివాడు: అహా! రోజుకి పదిసార్లు కాదు. వేసవి మొత్తంలో!

హీటర్

కిరణ్ : మా అమ్మ ఎప్పుడూ హీటర్‌లాగా వేడిగా వుంటుందిరా!

వరుణ్ : అయితే మీ నాన్నకు కరెంటు బిల్లు ఎక్కువగానే వస్తుందన్నమాట.

మదర్ ఆఫ్ ది హిస్టరీ

టీచర్ : ఫాదర్ ఆఫ్ ది హిస్టరీ ఎవర్రా?

గణేష్ : నాకు తెలీదండీ.

టీచర్ : వెధవా! అది కూడా తెలీదా? హెరడొటస్ ని ఫాదర్ ఆఫ్ ది హిస్టరీ అంటాం.

గణేష్ : మరైతే టీచర్! మదర్ ఆఫ్ ది హిస్టరీ ఎవరండీ?

ఐదు రూపాయలు

భిక్షగాడు : (ఓ మహిళతో) తల్లీ! నాకు 5 రూపాయలు ఇప్పించడమ్మా.

మహిళ : ఐదు రూపాయలే ఎందుకు?

భిక్షగాడు : ధరలన్నీ మండిపోతున్నాయికదమ్మా. అందుకే నా రేటు రూపాయి నుంచి ఐదుకు పెంచాను.

ఎంతగానో ప్రభావితం చేసిన గ్రంథం

-వకుళాభరణం రామకృష్ణ,
చరిత్ర పరిశోధకులు

మానవాళికి చరిత్ర దిక్సూచి లాంటిది. మానవ సమాజాలు గతంలో ఏ విధంగా మార్పులకు గురవుతూ వచ్చాయో తెలియజేయడమే గాక, ఆ మార్పులను వర్తమానంతో సంధానించడం ద్వారా, వర్తమానాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకోవడానికి చరిత్ర దోహదపడుతుంది. తద్వారా భవిష్యత్ పరిణామాలు ఏ దిశలో చోటుచేసుకుంటాయన్న పరిజ్ఞానాన్ని చరిత్ర అధ్యయనం కలగజేస్తుంది. చరిత్ర సామాజిక శాస్త్రాలన్నిటికీ తలమానికం లాంటిది.

చరిత్ర పాఠ్యాంశంగా కళాశాల విద్య మొదలు స్నాతకోత్తర స్థాయితో పాటు పరిశోధన వరకు ఎంపిక చేసుకొని, అభ్యసించి, ఆ తర్వాత అయిదు దశాబ్దాలు బోధనా వ్యాసంగంలో ఉండిన నన్నెన్నో చరిత్ర గ్రంథాలు ప్రభావితం చేశాయి. జీవిత గమనంలో, ఒక్కో దశలో, ఆ వయసును బట్టి, మానసిక పరిణతినిబట్టి, మారుతున్న అభిరుచులకనుగుణంగా పఠనాసక్తి మారుతూ ఉంటుంది. అందుకే, ఒక వ్యక్తి శీల నిర్మాణంలో, వ్యక్తిత్వ వికాసంలో ఒకటిగాక, ఎన్నో గ్రంథాలు నిర్ణాయక పాత్రను పోషిస్తాయి. వీధిబడి, హైస్కూలు దశలు దాటి కళాశాలలో చేరడంతో నిఖార్సయిన అర్థంలో నిర్దుష్ట పాఠ్యగ్రంథాలను లేదా సామాన్య గ్రంథాలను కొనడం, చదవడం ఆరంభమైనది. అప్పుడు మేము చదివే కళాశాలలో గ్రంథాలయం సరిగా లేక, ఒక వేళ కొద్దోగొప్పో ఉన్నా ప్రామాణిక చరిత్ర గ్రంథాలు లభ్యంకాక, లభ్యమైనా ఆంగ్లంలో ఉన్నవాటిని చదివి అర్థంచేసుకునే శక్తి లేక, అయ్యవార్లు చెప్పే నోట్సు తోనే సరిపెట్టుకొనే వాళ్ళం. పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం ప్రధాన లక్ష్యం. తీరుబడి సమయాల్లో కో- కరిక్యులర్ కార్యక్రమాల్లో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనడంతో గ్రంథాలు చదివే వ్యవధి ఉండేదికాదు. ఒకవేళ కొద్దోగొప్పో ఉన్నా అది విద్యార్థి రాజకీయ ఉద్యమాల సాహిత్యంతోపాటు గేయ సంకలనాలు, నాటికలు, వ్యాససంపుటాలు చదివేవాడిని. ఇవేవీ ప్రత్యేకించి స్ఫూర్తి నివ్వకపోయినా పఠనాసక్తి కల్గించేవి. అప్పట్లో మా తరం ఎక్కువగా చదివిన తెలుగు పుస్తకం శ్రీశ్రీ మహాప్రస్థానం. వెల ఒకరూపాయి మాత్రమే. ఎన్ని సార్లు చదివినా మళ్లీ మళ్లీ చదవాలనిపించేది. ఉత్సాహం ఉరకలు వేస్తున్నప్పుడేగాక మనసు వ్యాకులం చెందినపుడు కూడా మహాప్రస్థానం చదివేవాడిని. కళాశాల వక్తృత్వ పోటీల్లో మహాప్రస్థానం నుండి గేయపాదాలు అలవోకగా, సందర్భోచితంగా ఉటంకిస్తుంటే అందరూ విస్తుపోయేవారు.

కళాశాల దాటి విశ్వవిద్యాలయ చదువులకు వెళ్ళినప్పుడు మొదటిసారిగా నేను విన్నది, దాని గూర్చి మిత్రులు చెప్పగా నాలో ఆసక్తి రేకెత్తించిన గ్రంథం దామోదర వీర్ సావర్కర్ రచించిన 'ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్' (నేషనల్ రైజింగ్ ఆఫ్ 1857). 'భారత స్వాతంత్ర్య సంగ్రామం' (జాతీయ తిరుగుబాటు 1857) అనే ఈ గ్రంథం 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభి వర్ణించటమేగాక, ఆ ఘటనను ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా కూడా పేర్కొనింది. అప్పటి నుండి ఈ గ్రంథాన్ని చదవాలన్న ఆసక్తి కల్గింది. లైబ్రరీకి వెళ్ళాను. (ఆంధ్రవిశ్వవిద్యాలయం, వాల్తేరు) అక్కడ లభ్యంకాలేదు. అప్పట్లో మా లైబ్రేరియన్ అబ్బూరి రామకృష్ణారావుగారి వద్దకు వెళ్ళాను. 'లైబ్రరీలో లేదు, అది నిషేధించిన గ్రంథం కాబట్టి. ఒకప్పుడుండేది. మళ్ళీ తెప్పిద్దామన్నా లభ్యంకావడంలేదు. మరెవరిదగ్గరైనా, పాతకాలపు విద్యా వంతుల వద్దనో, లేదా స్వాతంత్ర్య సమర వీరుల వద్దనో దొరక వచ్చు"నన్నాడు. కుదరలేదు. చదవలేకపోయాను. అంతగా అరుదైన గ్రంథం.

కళాశాల దాటి విశ్వవిద్యాలయ చదువులకు వెళ్ళినప్పుడు మొదటిసారిగా నేను విన్నది, దాని గూర్చి మిత్రులు చెప్పగా నాలో ఆసక్తి రేకెత్తించిన గ్రంథం దామోదర వీర్ సావర్కర్ రచించిన 'ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్' (నేషనల్ రైజింగ్ ఆఫ్ 1857). 'భారత స్వాతంత్ర్య సంగ్రామం' (జాతీయ తిరుగుబాటు 1857) అనే ఈ గ్రంథం 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభి వర్ణించటమేగాక, ఆ ఘటనను ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా కూడా పేర్కొనింది. అప్పటి నుండి ఈ గ్రంథాన్ని చదవాలన్న ఆసక్తి కల్గింది. లైబ్రరీకి వెళ్ళాను. (ఆంధ్రవిశ్వవిద్యాలయం, వాల్తేరు) అక్కడ లభ్యంకాలేదు. అప్పట్లో మా లైబ్రేరియన్ అబ్బూరి రామకృష్ణారావుగారి వద్దకు వెళ్ళాను. 'లైబ్రరీలో లేదు, అది నిషేధించిన గ్రంథం కాబట్టి. ఒకప్పుడుండేది. మళ్ళీ తెప్పిద్దామన్నా లభ్యంకావడంలేదు. మరెవరిదగ్గరైనా, పాతకాలపు విద్యా వంతుల వద్దనో, లేదా స్వాతంత్ర్య సమర వీరుల వద్దనో దొరక వచ్చు"నన్నాడు. కుదరలేదు. చదవలేకపోయాను.

విశ్వవిద్యాలయంలో చదువు ముగించుకొని కావలి కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా చేరాను. పట్టాభి రామిరెడ్డి, కెవిఆర్ గార్లు మాకు విద్యార్థి దశలో చరిత్ర అధ్యాపకులు. ఇప్పుడేమో నేను వారికి సహోద్యోగిని. చరిత్రలో వారిద్దరూ ఉద్దండులు. వామపక్ష మేధావులు. ఇద్దరూ ఆ గ్రంథాన్ని చదివిన

వారే. కాని వారివద్దా ఆ ప్రతి లేదు. అప్పుడు నెల్లూరులో ఒక లాయర్ దగ్గర దాన్ని సంపాదించాను. చదవడం ఆరంభించాక ఒక్క పట్టున పూర్తయిందాక వదలబుద్ధి కాలేదు. నాకింకా గుర్తు. నేను చదివింది 1946లో ప్రచురించిన నాల్గవ ముద్రణ. అంతకు ముందు షాహీద్ భగత్‌సింగ్ చొరవతో ఒకసారి, దానికిముందే 1909లో, ఆ తర్వాత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రమేయంతో ఈ గ్రంథం ప్రచురించబడింది. ప్రతిసారీ ఆంగ్ల పాలకుల ఆగ్రహానికి గురై నిషేధింపబడేది. బహిరంగంగా దొరికేది కాదు. రహస్యంగా కొన్ని ప్రతులు మాత్రం చలామణిలో చేతులు మారుతుండేవి. ఆ క్రమంలో కొన్ని వేలమంది ఈ గ్రంథాన్ని చదివారు. ఉత్తేజితులైనారు.

నన్ను ఒక భారతీయుడిగా, చరిత్ర పరిశోధకుడిగా ఈ గ్రంథం ఎంతగానో ప్రభావితం చేసింది. 1857 తిరుగుబాటు గూర్చి ఒక భారతీయ విప్లవకారుడు రాసిన మొదటి గ్రంథం ఇది. అంతకు పూర్వం ఈ తిరుగుబాటుపై వెలువడ్డ దాదాపు అన్ని గ్రంథాలు ఆంగ్లేయ చరిత్రకారులు రాశారు. సావర్కర్ అవే గ్రంథాలను కూలంకషంగా అధ్యయనం చేసి ఆలోచనల్లోని అంతస్సారాన్ని నిశితదృష్టితో పరిశీలించి ఈ గ్రంథం రాసినట్లుగా రచయిత ఉపోద్ఘాతంతో ఇలా చెప్పుకున్నాడు.

"1857 సిపాయిల పితూరీగా చిత్రించబడిన మహత్తర చారిత్రక ఘటనలలో ఉజ్వలంగా ప్రకాశించే స్వాతంత్ర్య సంగ్రామాన్ని కనుగొన్నాను. చరిత్రలో మరుగున పడిపోయి విదేశీ చరిత్రకారులచే వక్రీకరించబడ్డ ఘనమైన 1857 తిరుగుబాటు గూర్చి అందులో ప్రాణత్యాగమొనర్చిన అమరవీరుల గూర్చి లోతైన పరిశోధనద్వారా ఒక గ్రంథాన్ని రాయదలచాను"

సావర్కర్‌కు లభించిన ఆంగ్ల చరిత్రకారుల రచనలతోపాటు తిరుగుబాటు జరిగిన వివిధ భూభాగాల నుండి ప్రాథమిక ఆధారాలను ఆయన సేకరించాడు. చరిత్ర ఆధారాల దృష్ట్యా, ఆ ఆధారాలను విశ్లేషించిన తీరు, ముఖ్యంగా భారతీయుల్లో నిక్షిప్తమైన జాతీయ భావజాలాన్ని సావర్కర్ అత్యంత నేర్పుతో గ్రహించగల్గాడు. ఈ పనితనం ఆ తర్వాత నా పరిశోధనలో నన్నెంతో ప్రభావితం చేసింది. చరిత్ర రచనలో రెండు ముఖ్య పార్శ్వాలుంటాయి. ఒకటి, పాలకుల చరిత్ర. రెండవది, పాలితుల చరిత్ర. సావర్కర్ పాలితుల చరిత్రనెలా చిత్రీకరించాలో ఈ గ్రంథంలో చేసి చూపాడు. చరిత్రకారులు గ్రహించాల్సిన ఈ సూక్ష్మాన్ని సావర్కర్ ఎంతో కాలం ముందుగానే చెప్పడం విశేషం. సావర్కర్ మాటల్లో,

"మన అత్యున్నత ఆశయం స్వాతంత్ర్యం. దీని కొరకు మనం పూనే దీక్ష ఏ రాజుకోసమో లేక ఏ వారసుడి కోసమో లేక ఏ కొద్దిమంది వ్యక్తుల కోసమోకాదు. రాజులు, సాధారణ ప్రజలు చరిత్రలో పుడతారు. గిడతారు కూడా. కానీ దేశం మరణించకూడదు. అది శాశ్వతం".

ఇదే సందర్భంలో సావర్కర్ మరో చోట ఇలా అంటాడు.

"దేశ స్వాతంత్ర్యమే ధ్యేయం. భయంకరమైన బానిస సంకెళ్ళను ఛేదించి దేశస్వాతంత్ర్యాన్ని సాధించడమే మన ప్రధాన ఆశయం"

జాతీయోద్యమానికి, ముఖ్యంగా అందులో పాల్గొన్న విప్లవకారులకు ఈ గ్రంథం 'గీత' లాంటిదని పలువురు విజ్ఞులు పేర్కొన్నారు. కురుక్షేత్ర రణరంగంలో అర్జునుడు హింస ప్రయోగానికి సందేహించినప్పుడు శ్రీకృష్ణుడు ఆ పరిస్థితుల్లో హింస ప్రయోగాన్ని సమర్థవంతంగా వివరించాడు. అదే రీతిలో ఈ గ్రంథం విప్లకారులనుద్దేశించి, వారు చేపట్టిన హింసామార్గాన్ని దేశస్వాతంత్ర్యం కోసం సమర్థనీయమని సావర్కర్ ఉద్ఘాటించాడు.

చరిత్ర రచనలో ఆ తర్వాత తరంలో రాబోయే జాతీయ చరిత్ర రచనా సంప్రదాయానికి ఈ గ్రంథం తొలిమెట్టు. అంతేగాక, ముందే చెప్పినట్లు, చరిత్ర గర్భంలో మరుగునపడి కన్పించని చీకటి కోణాలను చరిత్రకారులు

సావర్కర్‌కు లభించిన ఆంగ్ల చరిత్రకారుల రచనలతోపాటు తిరుగుబాటు జరిగిన వివిధ భూభాగాల నుండి ప్రాథమిక ఆధారాలను ఆయన సేకరించాడు. చరిత్ర ఆధారాల దృష్ట్యా, ఆ ఆధారాలను విశ్లేషించిన తీరు, ముఖ్యంగా భారతీయుల్లో నిక్షిప్తమైన జాతీయ భావజాలాన్ని సావర్కర్ అత్యంత నేర్పుతో గ్రహించగల్గాడు. ఈ పనితనం ఆ తర్వాత నా పరిశోధనలో నన్నెంతో ప్రభావితం చేసింది. చరిత్ర రచనలో రెండు ముఖ్య పార్శ్వాలుంటాయి. ఒకటి, పాలకుల చరిత్ర. రెండవది, పాలితుల చరిత్ర. సావర్కర్ పాలితుల చరిత్రనెలా చిత్రీకరించాలో ఈ గ్రంథంలో చేసి చూపాడు.

పరిశోధించి, వెలికి తీసి నిజాలను నిగ్గు తేల్చాల్సిన అవసరాన్ని సావర్కర్ తెలియజేశాడు. ఈ సందర్భంలో సావర్కర్ ఏమన్నాడో చూద్దాం.

"ఆంగ్ల రచయితల రచనలపై ఆధారపడి రాసిన ఈ గ్రంథం ఆ రచయితలు, చూడలేని చూడని అనేకానేక కోణాలను తిరుగుబాటుకున్న రెండో పార్శ్వాన్ని ఎత్తి చూపుతున్నది. కాని ఈ గ్రంథం సమగ్రమైందని నేననుకోవడం లేదు. సమీప భవిష్యత్తులో భారతీయ చరిత్రకారులు ఇంకా నమ్మకమైన రుజువులతో మరింత సమగ్రంగా 1857 తిరుగుబాటు చరిత్ర రాస్తారని, రాయాలని నా ఆకాంక్ష."

తిరుగుబాటు నూరు సంవత్సరాలు పూర్తి చేసుకొన్న 1957లో అనేక పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. అవి తిరుగుబాటుకున్న పెక్కు అంశాలను పరిశోధించాయి. ఇటీవల ఈ తిరుగుబాటు నూట యాభై సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఇంకా లోతైన పునర్ఃమూల్యాంకనం జరిగింది. ముఖ్యంగా 1857 తిరుగుబాటు స్వభావాన్ని గూర్చి దీర్ఘ చర్చలు జరిగాయి. ఇవన్నీ ఒకఎత్తు కాగా తిరుగు బాటును ప్రజల తిరుగుబాటుగా చిత్రించిన సావర్కర్ గ్రంథమే వీటన్నిటికి మూలం.

చారిత్రక స్పృహను గూర్చి సావర్కర్ చెప్పిన మాటలతో ముగిస్తాను.

"తన గతాన్ని గూర్చి స్పృహలేని ఒక జాతికి

భవిష్యత్తు లేదు. ఘనమైన గత్యాన్ని గూర్చి

కేవలం నెమరువేసుకోవడంతో సంతృప్తి చెందక,

భవిష్యత్ కార్యాచరణకు అది ఏ విధంగా

తోడ్పడగలదో గ్రహించాలి".

అయితే పరాయి పాలనపై పోరాడుతున్న క్రమంలో, సమయంలో దేశాన్ని ఉత్తేజితం చేసే రచనలందించిన సావర్కర్ జాతీయోద్యమంలో హిందూ మత భావాలకు లోనై మత వైషమ్యాలకు దోహదం చేయడం విషాదకరమైన చారిత్రిక వాస్తవం.

★

అక్షరాస్యతతో మొదలై అరుణారుణ చైతన్య పతాకమై...

మూడు దశాబ్దాల 'డైలీ దేశర్ కథ'

మూడు దశాబ్దాల కిందట అక్షర చైతన్య దీపికగా ప్రస్థానం మొదలుపెట్టిన 'దేశర్ కథ' పత్రిక త్రిపుర ప్రజల అరుణోద్యమ పతాకగా ప్రకాశిస్తోంది. ఇటీవలి ఎన్నికలలో దేశంలో అన్ని చోట్లా కమ్యూనిస్టులకు ఎదురుదెబ్బ తగిలినా రాష్ట్రంలోని అరవై శాసనసభా స్థానాలలోనూ వామపక్ష సంఘటనకే ఆధిక్యతనిచ్చిన అరుదైన ఉదాహరణగా నిల్చిన త్రిపురకు సుదీర్ఘ సమరశీల చరిత్ర వుంది. నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా నిరక్షరులైన గిరిజనులను కదిలించిన వీరోచిత పోరాట చరిత్ర అది. ఈ పోరాటంతో అవిభాజ్యంగా ముడిపడిన అక్షరాయుధం 'దేశర్ కథ'.

- తెర

దేశంలోని చాలా చోట్లలాగే త్రిపురలోనూ రాచరిక పాలన సాగుతుండేది. తక్కినచోట్ల కన్నా వెనకబడిన గిరిజనులకు నిలయమైన ప్రాంతం అది. బెంగాల్‌లో సంఘసంస్కరణ, సామ్యవాద భావాలు పెంపొందిన కొద్ది ఆ ప్రభావం కూడా త్రిపురపై పడింది. దానికి తోడు బెంగాలీల వలసలు కూడా చాలా ఎక్కువగా వుండేవి. ఈ నేపథ్యంలో 1930లలోనే త్రిపురలో కమ్యూనిస్టు ఉద్యమ కార్యకలాపాలు మొదలైనాయి. అయితే నలభయ్యవ దశకంలో అవి వూపందుకున్నాయి. 1945లో సుధాంశు దేవవర్మ, దశరథ దేవ్ వర్మ, హేమంత పద్మ తదితర గిరిజన విద్యావంతులు 'జనశిక్షా సమితి' పేరుతో ఒక సంఘాన్ని స్థాపించారు. గిరిజనులలో విద్యావ్యాప్తి వారి ఉద్దేశం. అనతి కాలంలోనే వారు అమితంగా శ్రమించి వందలాది ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పగలిగారు. 'జనశిక్షా సమితి' కార్యకలాపాలు గిరిజనులలో నవ చైతన్యం కలిగించాయి. అక్షరాస్యత పేరిట సాగుతున్న ఈ ఉద్యమం కమ్యూనిస్టు భావాలను కూడా వ్యాపింపచేస్తున్నదని రాజు విక్రమ కిశోర్ దేవ వర్మ అర్థం చేసుకోవడానికి పెద్ద సమయం పట్టలేదు. ఆ మరుక్షణం నుంచి ఆయన జనశిక్షణా సంస్థ కృషిని అడ్డుకోవడానికి అనేక పాచికలు వేశాడు. గిరిజన నాయకులను సమావేశపర్చి పోటీ యంత్రాంగాన్ని నెలకొల్పే ప్రయత్నం చేశాడు. మరో వైపు సుధాంశ, హేమంత దేవ్ వర్మలను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టాడు. దశరథ్ దేవ్(వర్మ) మాత్రం త్రిపురలో లేకపోవడం వల్ల తప్పించుకోగలిగాడు. ఈ అరెస్టులు చిత్రహింసలపై తీవ్ర నిరసన పెల్లుబికింది. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పెద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి.

అప్పుడే దేశానికి స్వాతంత్రం వచ్చింది. తెలంగాణా, వున్నప్రా వాయలార్ వగైరా చోట్ల సంస్థానాధీశులకు వ్యతిరేకంగా పోరాటాలు మొదలైనాయి. ఈ సమయంలోనే 1948 మే నెలలో త్రిపురలోనూ మన ఆంధ్ర మహాసభలా త్రిపుర గణవిముక్తి పరిషత్ ఏర్పడింది. కాంగ్రెస్ ఈ పోరాటాలను ఏ మాత్రం పట్టించుకోలేదు. జన శిక్షా సమితి నాయకులు విడుదల కాలేదు. కమ్యూనిస్టుల చొరవతో వారి విడుదలకోసం నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ పెద్ద ఉద్యమం చెలరేగింది. అప్పుడే త్రిపుర గణవిముక్తి పరిషత్ కమ్యూనిస్టుల సహకారంతో పత్రిక ప్రచురించడం మొదలెట్టింది. అది దాని తొలిరూపం. క్రమేణా కమ్యూనిస్టు ఉద్యమం దాడులను నిర్బంధాలను అధిగమించి గట్టిగా నిలదొక్కుకున్నది. 1950లో 41మంది కమ్యూనిస్టు నాయకులు బారమరా పర్వతాలలో సమావేశమై త్రిపుర కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. 1950 నాటికి అది కోవై నుంచి వెలువడి మంచి ప్రభావం చూపించింది. 1952 ఎన్నికలకు ఏడాది ముందు ఆ పత్రికను 'త్రిపుర కథ' పేరుతో వారపత్రికగా తీసుకొచ్చారు. ఎన్నికలలో ఇక్కడ కమ్యూనిస్టులు మంచి ఘన విజయాలు సాధించారు. దశరథ దేవ్ ప్రముఖ నాయకుడుగా ఎదిగారు. అరెస్టు వారంటుతోనే ఆయన పార్లమెంటులో అడుగుపెట్టారు. అనేక ఆటుపోట్ల మధ్య త్రిపుర కథ కొనసాగుతూ వచ్చింది. అయితే 1962లో భారత చైనా సరిహద్దు ఘర్షణ సందర్భంగా కమ్యూనిస్టు నాయకులలో ఒక భాగాన్ని (వీరే తర్వాత సిపిఎంగా ఏర్పడ్డారు) అరెస్టు చేయడంతో పత్రిక మూతపడింది. తర్వాత పునరుద్దరించుకున్నా సిపిఎంగా ఏర్పడిన వెనువెంటనే అందరినీ అరెస్టు చేయడంతో మళ్లీ ఇబ్బందులను ఎదుర్కొన్నది. చివరకు 1965లో 'దేశర్ ధర్' పేరుతో పునరుద్ధరణ జరిగింది. 1970లో దాన్ని 'దేశర్ కథ' గా మార్చారు. 1979 ఆగష్టు 15న దాన్ని డైలీ దేశర్‌కథ' పేరుతో పూర్తి స్థాయి దినపత్రికగా మార్చారు.

టియుజెఎస్- కాంగ్రెస్ దుష్టకూటమి దాడులు దౌర్జన్యాలకు దేశర్‌కథ నిరంతరం గురవుతూనే ధైర్యంగా పోరాడింది. 198-93 మధ్య కాంగ్రెస్ పాలన సాగినప్పుడు ఈ నిర్బంధ కాండ పరాకాష్టకు చేరింది. పత్రికపై నిరంతరం దాడులు జరిగాయి. సిబ్బందిని చిత్రహింసలు పెట్టారు. ఒక సందర్భంలో సంపాదకుడైన గౌతం దాస్‌పై హత్యాప్రయత్నం చేసి తీవ్రంగా గాయపర్చారు. అయినా పత్రిక సంపాదక వర్గం, విలేకరులు, ఏజంట్లు కూడా తలవంచేందుకు నిరాకరించారు. మారుమూల చిన్న రాష్ట్రమైనప్పటికీ ఎంతో పట్టుదలగా నిల్పి పత్రికను అన్ని విధాల అభివృద్ధి చేశారు. బెంగాలీ భాషలో వెలువడే ఈ పత్రిక రాష్ట్రంలో రెండవ స్థానంలో వుంది. రంగులలో వస్తుంది. ఎనిమిది పేజీలుంటుంది. ఇంటర్నెట్ ఎడిషన్ కూడా వుంది. ప్రధానంగా యువజన విద్యార్థి ఉద్యమాల నుంచి వచ్చిన వారు పత్రిక నిర్వహణ బాధ్యత చూస్తున్నారు. దాదాపు వందమంది వరకూ సిబ్బంది వుంటారు.

డైలీ దేశర్ కథ 2004లో సువిశాలమైన అయిదంతస్తుల భవనంలోకి ప్రవేశించింది. అగర్తలా నగరంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం వున్న వేల్మారా ప్రాంతంలోనే దేశర్‌కథ భవన్ పేరుతో నిర్మించిన కార్యాలయాన్ని ప్రకాశ్ కరత్ ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి వైద్యనాథ మజుందార్, ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తదితరులు పాల్గొని పత్రిక దీర్ఘకాలిక గమనాన్ని గుర్తు చేసుకున్నారు. దశరథదేవ్ ఈశాన్య భారతంలోనే తొలి గిరిజన ముఖ్యమంత్రిగా సేవ చేసి కన్నుమూశారు. నృపేన్ చక్రవర్తి అంతకు ముందు పార్టీ నేతగా ముఖ్యమంత్రిగా సేవలందించారు. వీరందరు వేసిన పునాదులు దేశర్ కథ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాయి. ఆ సభలోనే సంపాదకుడు గౌతం దాస్ పత్రిక సర్వతోముఖాభివృద్ధికి వివిధ వర్గాల నుంచి లభ్యమైన సహాయసహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ నాటినుంచి దేశర్ కథ పురోగమనం మరింత వేగం పుంజుకుంది. ఈ ఆగష్టు 15 వ తేదీన ముప్పయ్యవ వార్షికోత్సవంలో వివిధ రాష్ట్రాలలో సిపిఎం ఆధ్వర్యంలో నడుస్తున్న పత్రికల సంపాదకులు, అఖిలభారత నాయకులు హాజరుకానున్నారు. అనేక క్లిష్టమైన సవాళ్ల మధ్య దాడుల మధ్య సైద్ధాంతిక నిబద్ధత, కార్యకర్తల అంకిత భావం ప్రాణవాయువుగా విజయవంతంగా సాగుతున్న ఈ పత్రికకు మరిన్ని విజయాలు కలగాలని ఆశిద్దాం.

★



దేశర్‌కథ భవన్' కార్యాలయంలో ప్రకాశ్ కరత్

చిన్నకథ

పులొచ్చింది

- బి. హరివెంకట రమణ

తూర్పు కొండమీద చందమామ నిండుగా ఉన్నాడు. మామిడితోటలు.. ఆ వెనుక తూర్పు కనుమలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉండీ ఉండీ గాలి జామ్మని వీస్తూ వెళ్లిపోతోంది. కుందేళ్ళ వేటకు మామిడితోటకు దిగువనున్న కొండలదగ్గరకి వచ్చాం నేనూ, వర్మా, దివాకరం. నా చేతిలో పులిచారల కర్ర ఉంది. దివాకరం దగ్గర చార్జింగ్ లైట్ ఉంది. వర్మ దగ్గర ఓ నాటుతుపాకీ ఉంది. అప్పటికి గంటనుంచి సాగుతోన్న మా వేటకి కుందేలు కాదుకదా కౌజుపిట్ట కూడా కనిపించలేదు. కింగ్‌సైజ్ పాకెట్‌తీసి సిగరెట్ ముట్టించాడు వర్మ. దాంతో మా ఇద్దరిలో కూడా రిలాక్స్ మూడ్ వచ్చేసింది. ముగ్గురం కూర్చున్నాం. ఎదురుగా కొండలు కనిపిస్తున్నాయి. మైదానంలా ఉన్న ఆ ప్రదేశంలో రెండు తాటిచెట్లు మాత్రం నిశ్చలంగా ఉన్నాయి. గాలికి సరుగుడు చెట్లు స్పష్టంగా ఊగిపోతున్నాయ్. వర్మా, దివాకరం, నేను బాల్య స్నేహితులం. వాళ్లిద్దరూ వేరే ఊర్లో పెట్రోలియం కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. నేను టీచర్‌గా పనిచేస్తున్నాను. మనిషికి సహజంగా ఉండే వేటాడే ఉత్సాహం వల్ల, కాలక్షేపం కోసమూ, మా జీవితాల్లో ఇంకా ఎంత ఎడ్వెంచర్‌నెస్ మిగిలి వుందో పరీక్షించుకోవడం కోసమూ భోజనాలయ్యాక శనివారం రాత్రి ఇలా బయలు దేరాం. అప్పటికి సెల్‌ఫోన్‌లో టైమ్ పదకొండు చూపిస్తోంది. వర్మా వాళ్ల అన్నయ్యకి, నాన్నకి వేట సరదా ఉండేది. వాళ్ళ నాన్న పోయాక ఆ నాటుతుపాకి వీడి స్వంతమయింది. వాళ్లెప్పుడైనా ఆ తుపాకీని ఉపయోగించారో లేదో తెలీదుగాని ఏదైనా అనుకోని అవసరమొస్తే ఆ తుపాకి పేలుతుందో లేదో నాకు డౌటే! ఇక నా దగ్గరున్న కర్ర ఏ నక్కో వస్తే అదిలించి బెదిరించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఎవరూ ఏమీ మాటాడక పోవడంతో ఆ వాతావరణం చిన్నగా భయాన్ని కలిగిస్తోంది. అక్కడక్కడ ఉన్న డొంకల వెనుక నల్లగా ఏదో ఆకారం ఉందనే భ్రమ కలుగుతోంది. దూరంగా నక్క ఒకటి కోళ్లఫారం నుంచి కోడినొకదాన్ని నోటకరుచుకొని ఆదుర్దాగా పారిపోతోంది. దివాకరం ఒకసారి దానివైపు చార్జింగ్‌లైటు ఫోకస్ చేయడంతో అది మరింత వేగంగా కనుమరుగైపోయింది. ఈ కొండల వెనుకాతల పులిగాని తిరిగే అవకాశముందా? సిగరెట్ మసి నేలను రాల్చుతూ అడిగాడు వర్మ.

○ ○ ○

నిత్యం ప్రవహించే కొండవాగు మండు వేసవిలో ఎండిపోతుంది. మిగతా సమయంలో సన్నగా రోదిస్తున్నట్లుగా ప్రవహిస్తుంది. అందమైన గడ్డిపూలతోను. చుక్కల చేపలతోనూ, మట్టగడసలతోనూ ఉండే గెడ్డ ఇపుడు పాలిథిన్ కవర్లతోనూ, తాగేసిన కొబ్బరి బొండాల చెత్తతోనూ, జిల్లేడు మొక్కలతో చికాగ్గా ఉంది. మా చిన్నతనంలో ఈ గెడ్డలో ఆప్యాయంగా స్నానం చేసేవాళ్ళం. చొక్కా తీసేసి అటొకరు ఇటొకరు పట్టుకుని గుంతలో ఆ చివరనుంచి ఈ చివరకి తిరిగితే పది చేపపిల్లలైనా దొరికేవి. వాటిని సీసాలోవేసి 'నాచు' వేసి పెంచితే వారం రోజులకే చచ్చిపోయేవి. ఇంక కాలేజీలో చదివేటప్పుడయితే ఫిబ్రవరి మొదటివారం నుంచీ మా మకాం అంతా మామిడితోటల్లోనే. ఆ చెట్లకింద చల్లని నీడలో చదువుకునే వాళ్ళం. మధ్య మధ్యలో పచ్చి మామిడికాయలు కోసుకుని ఉప్పుకారంలో నంజుకుని తినేవాళ్ళం. తిన్నదరక్క సాయంకాలాలు జీడిమామిడితోటను ఆనుకుని ఉన్న చిన్న కొండెక్కి దిగడం... అలా రోజులన్నీ సరదాగా గడిచిపోయేవి.

"ఇంతకీ ఇక్కడ పులి ఉందంటావా, లేదా?" మరో సిగరెట్ ముట్టించి అడిగాడు వర్మ. దివాకరం కూడా వర్మ చేతిలోని మరో సిగరెట్ తీసుకుని సిగరెట్ గుండెకొనకు నిప్పెట్టాడు.

నేను చెప్పడం మొదలెట్టాను "అప్పుడు నేను పదోతరగతి చదువుతున్నాను. మేథ్స్ కంబైన్డ్ స్టడీ చేయటానికి సాయంత్రమే కోళ్లఫారం పక్కనే ఉంటున్న దిబ్బ కోదండం వాళ్ళింటికెళ్ళాను. అప్పట్లో ఊరునానుకుని ఉన్న మా కాలనీ ఏడింటికే సద్దుమణిగి పోయేది పల్లెటూరిలోలాగా. పైగా కాలనీ అంతా విపరీతంగా దొంగల భయం. దాంతో కాలనీ వాళ్ళంతా చందాలేసుకుని ఇంటికో కర్రా, విజిలూ కొని పెట్టుకున్నారు. దొంగలొస్తే జనాన్ని అలర్ట్ చేయడానికి. పోలీసుల సాయంతో గస్తీ కమిటీ ఒకటి వేసి రాత్రిళ్ళు ఇంటికొకరు చొప్పున, రాత్రి పదకొండు నుంచి తెల్లవారి ఐదింటి వరకూ తిరిగేవారు. గస్తీ తిరిగేటపుడు విజిల్స్ వేస్తూ, కర్రతో నేలకేసి కొడుతూ తిరిగేవారు. అలా మా కాలనీలో అందరిళ్ళలోనూ విజిల్సూ, కర్రలూ పోగుపడ్డాయి.

నేనూ మా దిబ్బకోదండంగాడూ మేథ్స్ ప్రాబ్లమ్ సాల్వ్ చేస్తున్న సమయంలో అంటే ఏడుగంటల ముప్పై నిముషాలకు విజిల్స్ వినిపించాయి ఒక్కసారిగా. 'ఇంత సందకాడే దొంగతనానికొచ్చిన దొంగనా కొడుకులెవర్రా" అనుకుంటూ గాభరాగా బయటికి వచ్చాం... విజిల్స్ వస్తున్న రామకృష్ణ గారింటివైపు పరుగులాంటి నడకతో చేరాం..

తీరా వాళ్ళింటి పిట్టగోడ వరకూ వెళ్ళాక రామకృష్ణగారి భార్య పులీ.. పులీ అంటూ బిర్ర బిగుసుకుపోయి అరవసాగింది.

ఆ మాటకి నేనూ, మా దిబ్బకోదండం కొయ్యబారిపోయాం. పులీ.. పులీ.. అంటూ ఆవిడ వాళ్ళింటికి ఎడంవైపున్న ముళ్ళతుప్పల వైపు చూపించింది. ఈలోగా విజిల్స్‌గోలకీ, కేకలకీ పల్చుగానే జనం పోగయ్యారు. రామకృష్ణగారి భార్య చెప్పడం మొదలు పెట్టింది.

"పులి... పులి అదిగో ఆ వీధిలైటు కింద ఇందాక దర్జాగా కూర్చునుంది. నా కేకలకి, అరుపులకీ, విజిల్స్‌గోలకీ... ఇప్పుడే అటువైపు వెళ్ళిపోయింది" అందావిడ గాభరాగా... ఇంతలో ఎక్స్ సర్వీస్‌మెన్ రామూర్తిగారు లైసెన్స్‌డ్ రివాల్వర్ పట్టుకొచ్చారు. ఆవిడ.. పులి కూర్చుందని చెప్పిన వీధిలైటు కింద పులి అడుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. రామూర్తిగారు లోడ్ చేసిన రివాల్వర్‌తో మామిడి తోటవైపు వెళ్ళారు... ఇవతల వీధిలైటువైపు వెలుగులో మేమున్నాం.. అవతల రెండు మామిడి చెట్లవతల ఏపుగా పెరిగిన కంపచెట్లున్నాయ్.. రామూర్తిగారు ఏమనుకున్నారో ఏమో తుపాకీ పైకి ఎత్తి గాలిలోకి రెండు రౌండ్లు కాల్చారు. ఢాం... ఢాం.. అని నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ తుపాకీ గుండ్లు గాలిలోకి వెళ్ళిపోయాయి. ఆ తుపాకీ మోత మా అందరిలో కొద్దిగా ధైర్యాన్ని నింపింది. పులి మరి ఇటురాదులే అని మాకు మేము సమాధానం చెప్పుకుని కాసేపు వీధిలైటు కింద ఉన్న పులి అడుగులను మళ్లీ చూసి, పులి కథలు చెప్పుకుని పులుల్లా గాండ్రించి, పిల్లుల్లా ఇంటికెళ్లిపోయాం.

"ఇంతకీ ఈ కొండల్లో పులి ఉందంటావా? లేదంటావా?" దివాకరం ఆదుర్దాగా అడిగాడు..

"అదే చెబుతుంటా. పులొచ్చింది... ఆ తరువాత కూడా ఒకటిరెండు మేకల్ని ఎత్తుకు పోయిందని, జీడిమామిడితోటల్లో కనిపించిందని ఊళ్లో చెప్పుకున్నారు. కొంతకాలం ఎవరూ ఒంటరిగా తోటలవైపు వెళ్లడం మానేశారు"

"ఆ తరువాత మళ్ళీ ఎప్పుడు పులి ఇటురాలేదా..." అడిగాడు దివాకరం.

"వచ్చింది.. కలిసి మెలిసి పిక్నిక్కులతో, ఆటలతో ఐకమత్యంగా ఉంటున్న ఊళ్లోకి ముందు 'కేబుల్ పులి' వచ్చి ఒక్కొక్కర్నీ మెల్లగా ఆరగించింది. ఆ తరువాత భూములకు డబ్బాశపెట్టి, పంటభూములపై అంతస్తులు కట్టిన 'రియల్ఎస్టేట్ పులి' వచ్చింది. ప్రస్తుతం ఈ పులిపంజాకి దొరకనోడు మా ఊళ్ళో ఒక్కడు కూడా లేడంటే నమ్ము..." అన్నాను. ఎక్కడో తీతువు ఒకటి అరిచింది.

పెద్దకొండమీది చందమామ మాత్రం.. మమ్మల్ని చూస్తూ.. మా ఊరి మీద వెన్నెల కురిపిస్తూ... ముందుకెళ్ళిపోతుందేమో అన్న భ్రమ కలిగిస్తూ ఉంది.

★

మనం తీసుకునే ఆహారంలో కూరగాయలు, పళ్లు ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. అవి మన శరీరానికి అవసరమైన కీలక పోషకాలను అందిస్తాయి. దాంతో పోషణ శాస్త్రజ్ఞులు కాయగూరలను, పళ్లను విరివిగా తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. గుండె జబ్బు, క్యాన్సర్లు మొదలైన దీర్ఘకాలిక రోగాలను నివారించడంలో అవి రక్షక పాత్రను పోషిస్తాయని ప్రపంచ వ్యాప్తంగా చేసిన పరిశోధనలు ఇటీవల నిర్ధారించాయి. పలురకాలుగా ఉపయోగించే అవకాశం వున్నందున కూరగాయల్లో టమాటాలు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.

టమాటా కబుర్లు

అసలు ప్రపంచంలోనే ఒక అతి ముఖ్యమైన ఆహార పంటగా గుర్తింపు పొందిన టమాటాల వుత్పత్తి ఆరుకోట్ల టన్నుల పైచిలుకు వున్నట్లు అంచనా. ఇంతకీ, టమాటా పండా? కాయగూరా? నిజానికి పండేకానీ తరచూ కాయగూరగా వాడుతున్నాం.

మంచి కండతోపాటు రసభరితమైన ఈ పండులో 5-7 శాతం పొడి పదార్థం వుంటుంది. మన దేశంలో కూరగాయగా మంచి ఆదరణ పొందిన టమాటా దాదాపు సంవత్సరం పొడుగునా లభిస్తుంది. దాన్ని పలు విధాలుగా వుపయోగిస్తారు. బాగా పక్వానికి వచ్చినప్పుడు దాన్ని పచ్చిగా గానీ, సూపులు, సాస్, ఊరగాయలు, కెచప్ మొదలైన వాటిలో వాడతారు.

పుట్టుపూర్వోత్తరాలు

మెక్సికోకు చెందిన రెడ్ ఇండియన్లు ఈ కూరగాయకు 'టమాటా' అన్న పేరు పెట్టారు. అది పదహారవ శతాబ్దిలో అమెరికా ఉష్ణప్రాంతాల నుండి మన దేశం చేరింది. అలా నాలుగు శతాబ్దాల క్రితమే వచ్చినప్పటికి, ఒక కూరగాయగా టమాటా గత శతాబ్దంలో మాత్రమే తన ప్రాచుర్యాన్ని పెంచుకుంది.

సాగుబడి

టమాటా పంటకు వెచ్చని వాతావరణం అవసరం. లోతైన వేళ్లుండే ఈ మొక్క నిలువుగా పెరుగుతుంది. మంచును మొక్క తట్టుకోలేదు. మన ఉత్తర ప్రాంతంలో మొదట జూన్ - జులైలోనూ, రెండవ పంట నవంబరులోనూ తీస్తారు. దేశపు పశ్చిమ, దక్షిణ ప్రాంతాలలో ఈ పంటను ఏడాది పొడుగునా సాగు చేస్తారు.

టమాటాలు ఎర్రగా ఎందుకుంటాయి?

ఎర్రరంగు టమాటాలు ఎక్కువ ప్రాచుర్యంలో వున్నప్పటికీ, గులాబీ, నారింజ, పసుపు పచ్చ, తెలుపు రంగుతో వున్న రకాలు కూడా మరీ అంత అసాధారణమైనవి కావు. దాని విలక్షణమైన ఎరుపు రంగు అందులోని లైకోపిన్ అనబడే ప్రధాన వర్ణం వల్ల ఏర్పడుతుంది. కెరోటినాయిడ్ సంబంధ వర్ణమైన లైకోపిన్, మన శరీరంలో విటమిన్ -ఎ గా మారుతుంది. పండు లోపలి కండభాగంలో కంటే, పండుపై తొక్క పొరల్లో ఈ లైకోపిన్ ఎక్కువగా వుంటుంది.

పండు పక్వానికి వస్తున్నప్పుడు అందులోని క్లోరోప్లాస్ట్‌లు, క్రోమో ప్లాస్ట్‌లుగా మారుతాయి. నాలుగు రోజుల్లోనే 20 డిగ్రీల ఉష్ణోగ్రతలో క్లోరోఫిల్ పూర్తిగా అదృశ్యమై, ఆరు రోజులప్పటికి గరిష్ఠ పరిమాణంలో లైకోపిన్ అందులో చేరుతుంది.

పళ్లపై సూర్యకాంతి నేరుగా ప్రసరిస్తే, పైభాగాలు లేత పసుపురంగులోకి మారి, తోలులాగ సాగుతాయి. ఎండాకాలంలో ఇలాంటి మార్పులు ప్రత్యేకించి కనబడతాయి. దాన్ని "సన్ స్కాల్డింగ్" అంటారు.

పంట కోతలు

పళ్ల వాడుక అవసరాన్ని బట్టి, వివిధ దశల్లో కోస్తారు.

1. ఆకుపచ్చ దశ : పళ్లు ఎర్రగా మారడానికి 15 రోజులు ముందుగానే, ఒక కొసలో కొద్దిగా ఎరుపు చాయ అగపడుతుంది. ఇంకా ఆకుపచ్చ రంగులో వున్నప్పటికీ అవి పూర్తిగా వృద్ధి చెందినవే. అలాంటి పళ్లను కోసి దూర ప్రాంతాల మార్కెట్లకు పంపిస్తారు.

2. గులాబీ రంగు దశ : ఈ దశ, పండు రంగు అడుగున ఎరుపు లేదా గులాబీ రంగు కొద్దిగా మాత్రం వుండడం, లేదా పండు మొత్తం అలాంటి లేతరంగు వుండడం కనిపిస్తుంది. ఈ దశలో చాలా భాగం పళ్లు ఎరుపు రంగులో వున్నప్పటికీ, అవి పూర్తిగా పండి వుండవు. అలాంటి పళ్లను స్థానిక మార్కెట్టుకు పంపడానికి కోస్తారు.

3. పక్వ దశ : ఈ దశలో చాలా భాగం పళ్ల ఉపరితలం ఎర్రగా మారి, పళ్లు మెత్తబడి వుంటాయి. అలాంటి వాటిని ఇంట్లో వాడుకకు వుపయోగిస్తారు.

4. పూర్తిగా మాగిన దశ : పళ్లని ఈ దశలో పూర్తిగా ఎరుపు రంగులోకి మారి, తాకితే మృదువుగా వుంటాయి. పండులోని స్టార్చ్ చక్కెరగా మారి ఉంటుంది. సాధారణంగా కోసిన 24 గంటలలోపు వాటిని పంటలోగాని, ఊరగాయ తయారీలో గాని వాడతారు.



ప్యాక్ చేయడం

టమాటాలను ప్యాక్ చేయడానికి రకరకాల పద్ధతులను వాడతారు. స్థానిక మార్కెట్లకు రవాణా చేసేటప్పుడు టమాటాలను ప్యాక్ చేయడంలో అంత శ్రద్ధ తీసుకోరు. కానీ దూరప్రాంతాలలోని మార్కెట్లకు చేరవేసే సమయంలో పళ్లను వెదురు బుట్టలు లేదా కొయ్య పెట్టెల్లో పొరలు పొరలుగా వరుసల్లో అమరుస్తారు.

టమాటాల నాణ్యత

టమాటా వ్యాపారం విషయంలో చాలా దేశాలు కొన్ని నాణ్యతా సంబంధ చర్యలు అనుసరిస్తాయి. పళ్ల నాణ్యతను నిర్ణయించడంలో, సైజు, రంగు బాగుండడమే కాకుండా పండు దెబ్బ తినడం, కుళ్లి పోవడం, చీడ పీడలు మొదలైనవి లేకపోవడం వంటి లక్షణాలను కూడా పరిగణలోనికి తీసుకుంటారు.

పండు బాగున్నదంటే దాని వాసన, రుచి కూడా ఆమోదయోగ్యంగా వుండాలి. టమాటాలోని చెక్కెరలు, అందులోని ఆమ్ల గుణాల మధ్య పరస్పర చర్యను బట్టి పండుకు ఆ విలక్షణమైన రుచి అబ్బుతుంది.

టమాటాలో రుచి, వాసనలకు దోహదపడే, తొందరగా ఆవిరి అయ్యే రసాయనాల గురించి శాస్త్రజ్ఞులు చాలా ఆసక్తిని చూపించారు. ఆకుపచ్చ రంగు పళ్లలో అలాంటి రసాయనాలు అతి తక్కువ స్థాయిలో వుంటాయి. కానీ, పక్వానికి వచ్చిన పళ్లలో 200 కంటే ఎక్కువ రసాయనాలు వున్నట్లు గుర్తించారు. వీటిలో చాలా రసాయనాలు వాసనను కలిగించడంలో దోహదపడినప్పటికీ, పండు తినడానికి పసందుగా, రుచి, వాసనలను వెదజల్లడానికి బహుశా 15 రసాయనాలు ప్రభావితం చేస్తాయి.

ప్రోసెసింగ్ చేయడంతో టమాటాల రుచి, వాసనలు మారతాయి. ప్రోసెస్ చేసే క్రమంలో పండులోని ఎంజైముల స్వభావం మారుతుంది. సూక్ష్మ జీవులు లేకుండా పోతాయి. రుచికి సంబంధించిన ప్రధాన రసాయనాలు అలాగే వున్నప్పటికి, తాజా పండులోని వాసనకు సంబంధించిన రసాయనాలు నశిస్తాయి. ప్రోసెస్ చేస్తున్నప్పుడు ఎంజైములతో నిమిత్తం లేకుండా అదనంగా రుచి, వాసనలిచ్చే రసాయనాలను చేరుస్తారు. ప్రోసెస్ చేసిన టొమేటోలను ఎక్కువ పాళ్లలో చేర్చి 'పేస్ట్' రూపంలో కనీసం 24శాతం ఘన పదార్థాలు వుండేలా చూస్తారు. సాస్, కెచప్, సూప్‌ల వంటి ఉత్పత్తులలో వుపయోగించడానికి ఎక్కువకాలం పాటు పేస్ట్‌ను నిల్వ వుంచవచ్చు.

ఆరోగ్యపరమైన లాభాలు

భారతీయ వంటల్లో ఒక అంతర్భాగమైపోయిన టమాటా సంవత్సరం పొడుగునా అందరి ఇళ్లల్లో వాడబడుతోంది. ఎక్కువ పరిణామంలో వాడుతున్న కారణంగా టమాటాలు చాలా సూక్ష్మ పోషక పదార్థాలను కూడా చక్కగా సరఫరా చేస్తాయి. అందులో పొటాషియం చెప్పుకోదగినంత మేర (ప్రతి 100గ్రాముల్లో 144మి.గ్రా) వున్నందు వల్ల అధిక రక్తపు పోటు వున్న వారికి మేలైన ఆహారంగా భావించవచ్చు. టమాటాలను మామూలుగా పచ్చివిగా తింటే కనుక పొటాషియం ఎక్కువగానే శరీరానికి అందుతుంది.

కానీ సలాడ్‌గా టమాటాలను వుపయోగిస్తున్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పళ్లను శుభ్రంగా, ప్రవహిస్తున్న నీటిలో కడిగి పైభాగం నుండి మురికి, అనవసరమైన పదార్థాలు లేకుండా చూసుకోవాలి. ఈ పాటి సరళమైన జాగ్రత్తను తీసుకుంటే ఆహారం ద్వారా వ్యాప్తి చెందే రుగ్మతలు రాకుండా నివారించవచ్చు.

★

టమాటా పోషక విలువలు

(తినగలిగిన భాగం ప్రతి 100 గ్రాముల్లో)

	పచ్చివి	పక్వానికొచ్చినవి
తేమశాతం	93.1	94.0
మాంసకృతులు (గ్రా)	1.9	0.9
ఫైబర్ (క్రూడ్) (గ్రా)	0.7	0.8
కార్బొహైడ్రేట్లు (గ్రా)	3.6	3.6
శక్తి (కిలో కేలరీలు)	23	20
కెరోటిన్ (మై.గ్రా)	192	351
కాల్షియం (మి.గ్రా)	20	48
పాస్ఫరస్ (మి.గ్రా)	36	20
ఇనుము (మి.గ్రా)	1.8	0.64
పొటాషియం(మి.గ్రా)	114	146
విటమిన్-సి (మి.గ్రా)	31	27



సీరియల్

గని

జరిగినకథ:

బికాస్ తండ్రి అప్పు కింద ఉన్న భూమికాస్తా పోగొట్టుకుంటాడు. అవమానభారంతో జీవించలేక తల్లీదండ్రులిద్దరూ ఆత్మహత్య చేసుకుంటారు. దాంతో బికాస్ బాధ్యతను అతని అక్క స్వీకరిస్తుంది. గతంలోంచి వర్తమానంలోకి వస్తే గని కార్మికులకు రుణాలిచ్చినవారు అప్పు తీసుకున్నవారి భార్యలను లైంగికంగా దోచుకుంటుంటారు. అది ఆ మహిళలకు ఏమాత్రం ఇష్టంలేకపోయినా అలా జరుగుతూనే వుంటుంది. ఓసారి ఓ మహిళ దగ్గరకు రుణదాత ఇలాగే వస్తాడు. ఆమె ఇష్టాఇష్టాలతో సంబంధంలేకుండా శారీరకవాంఛ తీర్చుకోజూస్తాడు. ఆమెకు మాత్రం అదంతా నరకప్రాయంగా వుంటుంది. వాడికి ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకుంటుంది. వీధిలో ఎవరో వెళ్తున్న మాటలు విని దొంగ దొంగ అని అరుస్తుంది. జనాలు పోగవుతారు. విషయం అడుగుతారు. సరిగ్గా అప్పుడే బికాస్ కూడా అక్కడికి వస్తాడు. ధైర్యంగా విషయం చెప్పిందామె. జనాలంతా కలిసి అతడికి దేహశుద్ధి చేశాక ... ఆ మహిళ కుటుంబం చేసిన అప్పు మొత్తం మాఫీ చేయడమేకాక ఇతరుల దగ్గర కూడా ధర్మవడ్డీ మాత్రమే తీసుకోవాలని చెప్తాడు బికాస్. అందుకా రుణదాత అంగీకరిస్తాడు. ఆ తర్వాత....

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(పంతొమ్మిదవ భాగం)



కసవు కప్పిన పాక. దాని మీదుండే పురుగుల్ని తినడం కోసం కోళ్ళు పాకను కెలకడం వల్ల ఏర్పడ్డ రంధ్రాల గుండా ప్రసరిస్తూ ఉషా కిరణాలు గోడల మీద రంగవల్లికలు దిద్దుతున్నాయి. ఒక్కోసారి నిదురిస్తోన్న వాళ్ళ చెంపల్ని చుర్రుమనిపించి, వాళ్ళను మేల్కొలుపుతాయి ఉషాకిరణాలు. ఆ జనావాసంలో అన్నీ మట్టి గోడలే. నెర్రెలు వారిన బీడుభూమిలా బీటలు వారిన గోడలు. ఆ బీటల్లో నివాసం ఏర్పరుచుకొన్న క్రిమికీటకాలు. దిగంబరంగా పడుకొని నిద్రపోతున్న పిల్లలు. చెమటా మురికీ కలగలిసిన చింపిరి బట్టలతోనే వీధిలోకి వస్తోన్న స్త్రీలు. ఇళ్ళలోనూ, వీధుల్లోనూ పందులు, కోళ్ళు, కుక్కల మలమూత్రాలు....

ఆ రోజు సెలవు కావడంతో అందరూ కాస్త ఆలస్యంగానే నిద్ర లేచారు. వేట కుక్కల బారి నుంచి తప్పించుకొని పొదరింట్లో పడుకొన్న కుందేలులా పనివొత్తిడి లేకుండా హాయిగా గడపొచ్చు. పనివొత్తిడి నుంచి తాత్కాలికంగా ఉపశమనం కలిగినా కుటుంబం సమస్యల నుంచీ, దుఃఖభారం నుంచీ ఎప్పటికైనా ఉపశమనం కలుగుతుందా?

వడ్డీ వ్యాపారి, వస్త్ర వ్యాపారి తదితరులు జీతం రోజున గని ముఖద్వారంలో నిలబడి, సొమ్ము రాబట్టుకోవడం నిజమే, గానీ క్రమం తప్పకుండా నెల నెలా తమ దగ్గరకి వచ్చి చెల్లించే వాళ్ళను నిలబెట్టి వసూలు చేయరు. అలాంటి కార్మికులు ఇళ్ళకు వెళ్లి ఆదాయవ్యయాలను బేరీజు వేసుకొని అప్పు తీర్చడానికి బయలు దేరతారు.

కనీసం జీతం నాడయినా సంతోషంగా ఉందామనుకుంటే కుదరదు. నెలసరి ఖర్చుల్లో చేరిన అప్పుల జాబితా, ఎదురు చూడని ఖర్చులూ తడిసి మోపెడై ప్రతి కుంటుంబాన్ని భూకంపంలా కుదిపేస్తాయి. కుక్కను కట్టేసి కొడుతున్నట్టు నిర్దయగా హింసిస్తోన్న యాజమాన్యం ఒకవేళ కుక్క కట్టు తెంచుకొంటే తిండి పెడుతోన్న యజమాన్నే కరచి ఊరుకుంటుందా? ప్రస్తుతం కార్మికుల మానసిక స్థితి కూడా అలాగే ఉంది.

ఒకవైపు శ్రమదోపిడి. నిర్ణయించిన పరిమాణంగా కన్నా ఎక్కువ మోతాదులో బొగ్గు నింపాల్సి వచ్చేలా తూకంలో మోసం. తెలిసినా అడగలేని పరిస్థితి. యాజమాన్యంవారి చిత్తశుద్ధినే శంకించినట్టవుతుంది. ఉద్యోగం కోల్పోయి, వీధిన పడాల్సిందే. సరే వేరెక్కడికైనా పోయి బతుకుదామనుకొంటే అప్పుల ఊబిలోంచి బయట పడకుండా ఎలా వెళ్లగలడు? చాలీచాలని జీతం వల్ల నోరు కడుపూ కట్టేసుకొని, వడ్డీ చెల్లించిన చేత్తోనే అప్పు తీసుకోవాల్సి రావడం వాళ్ళు బయట పడకుండా కట్టి పడేసింది. ఇలాంటి జంజాటం లేని వాళ్ళు కూడా బయటకి వెళితే ఉపాధి హామీ లేకపోవడం, దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా బతకాల్సి వస్తుందేమోన్న భయం, తాళజాలని అణచివేతకూ హింసకూ తలొగ్గి బతికేలా చేసింది. ఈ వలయాన్ని ఛేదించడం ఎలా?

విశ్రాంతిగా కూర్చున్నప్పుడు దీని గురించి చర్చిస్తారు. ఆ చర్చలు వాళ్ల మనసుల్లోని ఆక్రోశాన్ని వెలిగక్కడానికి ఉపకరిస్తాయే తప్ప తాను ఆశిస్తోన్న మార్పుకు ఏ మాత్రం దోహదం చేయదు. అయితే పెళ్లీ పెటాకులు లేని వ్యక్తి అధ్యక్షతన తమకంటూ ఓ సంఘాన్ని ఏర్పాటుచేసుకున్నారు. అతడు పెళ్ళీపెటాకులు లేని వ్యక్తి ఒంటిగాడవడం, అక్క పంచన ఉండడం అతడి కార్యకలాపాలకు భద్రతనిస్తున్నట్లు భావిస్తారు కార్మికులు.

జీతంలో కోత విధించడం అన్నది ధారావాహికగా కొనసాగుతోన్న అంశం. గతంలో భద్రతారాహిత్యం మరీ ఎక్కువగా ఉన్నప్పుడు, ఎంత ఘోర అన్యాయాన్నైనా కిమ్మనకుండా సహించే వాళ్ళు ఇప్పుడు సంఘం పెట్టుకోవడంతో కొద్దిగా ధైర్యం వచ్చింది. నిన్నటి సంఘటనకు ఈ ధైర్యమే కారణం.

ooo

గోడ పగుళ్ళు నుంచీ వచ్చే ఊట రాకుండా పగుళ్ళను మూసేయడం, చెరువులో పూడిక తీయడం, కప్పు కూలిపోకుండా దానికి ఊతంగా గింజల్ని పాతడం వంటి ప్రత్యేకంగా చేయించాల్సిన పనుల్ని సైతం యాజమాన్యం వారు పనివేళల్లోనే కార్మికుల చేత చేయిస్తున్నారు. కార్మికులు పైపనులన్నీ చేయడంతో పాటు తమకు కేటాయించినంత బొగ్గు తవ్విపోయగలగితే అది ఎనిమిదో వింతవుతుంది.

వాళ్ళకు శక్తికి మించినంత బొగ్గు తవ్విపోయాలని లక్ష్యం నిర్దేశిస్తారు. నిర్దేశిత లక్ష్యం కంటే ఒకటిన్నర రెట్లుండే బొగ్గుతొట్టె నింపాలి. ఇంతేగాకుండా మరమ్మతు పనులు చేయమని పురమాయిండం, శిక్షించడం గనులు ప్రారంభమైనప్పటి నుండి కార్మికులంతా ప్రాణాలు అరచేత పట్టుకొని పని చేస్తున్నారు. ఎలాంటి త్యాగానికైనా సంసిద్ధపడినప్పుడు మాత్రమే హరించుకుపోతున్న హక్కుల్ని దక్కించుకోవడం గానీ, కాస్తోకూస్తో సంక్షేమం కలగడం గానీ సాధ్యమన్న అవగాహన వాళ్ళలో ధైర్యం నింపింది. ఆ అవగాహన పర్యవసానమే సంఘం ఏర్పాటు.

సుకుమార్ బౌరి సమస్యను వివరించాడు చంచల్ కుమార్. జీతంలో యాభై శాతం కోత. అతడు తనకు నిర్దేశించిన లక్ష్యం మేరకు బొగ్గు తవ్వి పోశాడు. ఒక్కరోజయినా సెలవు పెట్టలేదు. అయినా జీతంలో యాభైశాతం కోత! ఇదెక్కడి న్యాయం? దేనికోసం కోత విధించారు? అని ప్రశ్నించాడు.

గని ఇంజనీరు నితాయ్ సమక్షంలో జీతాలు బట్వాడా చేయడం ఆనవాయితీ. అతడు ఇటువంటి ప్రశ్నను ఎదుర్కోవడం ఇదే తొలి పర్యాయం. ఈ ప్రశ్న తన అధికారానికి సవాల్ మాత్రమే కాదు, కల్పవృక్షం మీద రాళ్ళు రువ్వుతున్నట్టుగా ఉంది.

"పనిలో కొదవేమీ లేదు. అయితే నేను గమనించినప్పుడు పడుకొని నిద్రపోతున్నాడు. అందుకే జీతంలో కోత విధించాను" అన్నాడు. నితాయ్.

ఆరోజు సుకుమార్ పరగడుపున వచ్చాడు. ఇంట్లోంచి బయలుదేరేటప్పుడు కలో, గంజో కాచుకుందామన్నా అందుకు అవసరమైన దినుసులేమీ లేవు. పొద్దున ఎవరి దగ్గరైనా చేబదులుగా ఏవైనా దినుసులు తీసుకొచ్చి గంజి కాచాలని చెప్పింది భార్య. అందువల్ల సుకుమార్ ఏమీ తాగకుండానే బయలుదేరి వచ్చేశాడు పనిలోకి. ఆకలికి కళ్ళు తిరిగాయి, కాసేపు పడుకొన్నాడు. అయినా తనకు కేటాయించిన పనిలో కొదవేమీ లేకుండా జాగ్రత్త పడ్డాడు. కాస్త తటపటాయిస్తూ అతడన్నాడు, "బాబుగారూ, కొదవపెట్టకుండా నాపని పూర్తి చేశాను కదా! ఆకలికి కళ్ళు తిరగడంతో, కాసేపు పడుకొన్నానంతే"

అతడి వాదన సబబేనని ఇంజనీరుకు తెలియక పోలేదు. అయితే కార్మికులకు బుద్ధిచెప్పాలని తహతహలాడుతున్నాడు. అందుకే ఈ నెల అనేక మంది కార్మికుల జీతంలో కోత విధించాడు. అలా చేస్తే వాళ్ళ కొవ్వణుగుతుందని అతడి అభిప్రాయం. "నువ్వు చాలా మంచివాడివి. చూసీచూడనట్టు వదిలేస్తే మిగతా వాళ్లకు పొగరెక్కుతుంది. నీకు శిక్ష విధించడం ఇతరులకు గుణపాఠంగా వుండాలి... జీతం తీసుకొని వెళ్లు. తర్వాత చూద్దాం" అన్నాడు జాలి ధ్వనిస్తున్న స్వరంతో.

ఇందులో ఏదో తిరకాసు ఉందని గ్రహించాడు సుకుమార్. చిన్న చిన్న కారణాలతో కొందరి జీతాల్లో కోత విధించబడి ఉండడం, వాళ్ళ ప్రతిఘటించకుండా గొణుక్కుంటూ జీతాలు తీసుకెళ్ళడం అతడు గమనించాడు.

ఇంజనీరు నితాయ్ మాట అతడిలో కొత్త ఆలోచనలకు బీజం వేసింది. దోపిడీవర్గం కార్మికుల శ్రమను దోపిడీ చెయ్యడమే కాదు, మాటలతోనూ గారడి చేస్తోంది. అతడి హృదయంలో అలజడి. జీవితాన్ని, అది మోపే బరువు బాధ్యతల్నీ గుర్తుచేసుకొన్నాడు. లోలోపల ఏవేవో భావ తరంగాలు వెల్లువెత్తుతున్నాయి. గుండె దిటవు చేసుకొని, జీవితంలో తొలిసారి అధికారాన్ని ధిక్కరించడానికి పూనుకొన్నాడు.

"నా పనిలో కొదవ లేదు. సేద దీర్చుకోవడానికి కాస్త కునుకు తీశాడు. కంపెనీకి నష్టం వాటిల్లిఉంటే, మీరు విధించే శిక్షను స్వీకరిస్తాను. అదీ కాకుండా..."

అతడి మాటలు పూర్తి కాలేదు. ఇంజనీరుకు దిగ్భ్రాంతి కలిగింది. కార్మికుడొకడు యాజమాన్యంతో ముఖాముఖి తలపడడం అతడికి అనుభవంలో లేని విషయం. దీన్నెలా సహించగలడు? క్రమశిక్షణ కుంటుబడదా? ఈదురు గాలుల్లో చిక్కుకొన్నవాడి శరీరమంతా దుమ్మూ, ధూళీ ఆవరించినట్టు, ఎదురుచూడని దాడికి గురైన ఇంజనీరు, గుండె అహంకారంతోనూ, ఉక్రోషంతోనూ సలసలా మరిగింది. "నీకే కాదు, చాలా మందికి కోత విధించాం. అలాంటప్పుడు నీ ఒక్కడి విషయంలో దయాదాక్షిణ్యాలు చూపించలేం. అలా చూపిస్తే వ్యాపారం కట్టేయవలసిందే" అన్నాడు కాస్త కటువుగా.

ఉడుకుతోన్న ఎండిపోయిన పొగాకులా నల్లగా ఉన్న సుకుమార్ మనసుతో, సాంబారులా రకరకాల భావాలు ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ఇవ్వజూపుతోన్న జీతాన్ని స్వీకరించాలా? లేదంటే, దాన్ని తిరస్కరించి సమస్య సృష్టించాలా? హఠాత్తుగా మంచాన పడి ఉన్నప్పుడు బికాస్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. కష్టాల ద్వారా ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకొన్న వాణ్ని నేను. ఏ ఇరకాటమూ, బెదిరింపూ, హింసా నన్ను నా మార్గం నుంచి తప్పించలేవు. ప్రజా సంక్షేమానికి అంకితమై పోయినవాడి హృదయం, ఆధిపత్యాన్ని ధిక్కరించడంలో వజ్ర సదృశంగా ఉంటుంది. ప్రజల విషయంలో పుష్పంలా మృదువుగా ఉంటుంది.

అనుకొన్నంత తేలికగానూ, ధైర్యంగానూ, నిర్ణయం తీసుకోనిస్తాయా కుటుంబ పరిస్థితులు? ప్రకృతి ప్రసాదించిన రక్షక కవచాలు, మానవుడు ఏర్పరచుకొన్న భౌతిక సుఖాలు వీటన్నింటికీ అతీతంగా గాఢమైన స్వార్థ రహిత జగత్తులోకి అడుగు మోపడం ఎంతో కష్టసాధ్యం? ఎత్తైన వృక్షపు చిటారు కొమ్మన పదిలంగా ఉన్న పిట్టగూడు లాంటిది తన జీవితం అనుకొన్నాడు. చెదిరిపోతోందని గజగజ వణికిపోయాడు.

ఎక్కడెక్కడో విన్న భావాలు అతడ్ని కుదిపేశాయి. మానవుడికి సమాజశ్రేయస్సు పట్ల అక్కడ ఉండాలి. నైతిక బలం ఉండాలి. అవి లేనప్పుడు మానవుడి భావాలూ, చర్యలూ పక్కదారి పడతాయి. దీర్ఘ చింతనలోంచి ధైర్యమూ, విశ్వాసమూ కలిగాయి. జీవితం తాలూకు వెరపు తెర మెలమెల్లగా తొలగిపోసాగింది.

మనసులో మళ్లీ కల్లోల తరంగాలు. భౌతిక లాలస గళవాళ్ళ దగ్గర నీతి నిజాయితీలు కనిపించవు. ఆకలితో అలమటిస్తోన్న వాడికి నీతి నిజాయితీల గురించి ఉపదేశాలు ఇవ్వకూడదు. దోపిడీవర్గం తన దోపిడీని సమర్థించుకోవడం కోసం బీదవాళ్ళకు ఈ కవచాన్ని బిగించాలని చూస్తోంది.

విసుగూ, అసంతృప్తీ కలగలిసిన కళ్లతో చూస్తూ సుకుమార్ చెప్పాడు. "నా జీతం పూర్తిగా ఇవ్వకపోతే, నేను జీతం తీసుకోను".

దీర్ఘశ్రుతిలో, తీవ్ర ధ్వనితో అతడు చెప్పిన మాటలకు అప్పటి దాకా ఇంజనీరు నితాయ్‌లో ఉన్న నమ్మకమూ, ధైర్యమూ కుప్పకూలిపోతున్నట్టు అనిపించాయి. అతడు కుర్చీలోంచి లేచాడు. నడవలేకపోయాడు. ఎముకలూ, నరాలూ చిట్లిపోయినట్లు బలహీనంగా ఉంది.

సుకుమార్ ఆలోచనలో పడ్డాడు. గతస్మృతులు నీటి బుడగల్లా వచ్చి మాయమవుతున్నాయి.

అతడు ధన్‌బాద్‌లోని ఓ గనిలో పనిచేసేవాడు. వడ్డీ వ్యాపారం చేసే దాన్ని గుత్తకు తీసుకొన్నాడు. తీవ్రమైన కరవు. ఒరిస్సా నుంచీ గోరఖ్‌పూర్ నుంచీ మిడుతలదండులా వలస వస్తున్న జనం ఓ పూట పొట్ట పోసుకోవడానికి ఎక్కడ పని దొరకుతుందో అక్కడికి రెక్కలు కట్టుకొని వెళ్ళి వాలేవాళ్లు.

కరువొస్తే చాలు, వడ్డీ వ్యాపారులకు కనకవర్షం కురిసినట్టే.

(ఇంకావుంది)

ఫొటో ఫ్రేం కావాలా

హాయ్ పిడుగులూ! మీకు ఫొటో ఫ్రేం చేయడం ఎలాగో తెలుసా? ఎంటీ తెలీదా! అయ్యో... చాలా సింపుల్.

<u>ఏమేం కావాలంటే...</u>

మన ఇంట్లో వేరు శనక్కాయలు వుంటాయి కదా. అవి కొన్ని, సూది, దారం, రెండు రకాల పెయింట్లు, ఒక పెయింటు వేసే బ్రష్, ఒక మందపాటి అట్టముక్క, మీ ఫొటో అంతే.

<u>ఎలా చేయాలంటే...</u>

ముందుగా ఒక మందపాటి అట్టముక్క తీసుకుని గుండ్రంగా (అంటే మన ఫొటో పట్టేంత సైజు కన్నా కొంచెం పెద్దగా అన్నమాట) కత్తిరించుకోవాలి. దానిపైన వేరుశనక్కాయలను ఈ అట్టపైన ఒక దానిపక్క ఒకటిగా ఫెవికాల్‌తో అతికించాలి. తర్వాత వాటిపై మీకిష్టమైన పెయింటును వేసి ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిపోయిన తర్వాత మీ ఫొటోని మధ్యలో అతికించేయడమే. మీ ఫొటో ఫ్రేం రెడీ అయిపోయింది. ఇప్పుడు చూడండి ఎంత బాగుందో... ఎంచక్కా మీ బుజ్జి బుజ్జి చేతులతో తయారు చేసుకున్న ఈ ఫొటో ఫ్రేంని మీకిష్టమైన వారికి, మీస్నేహితులకు గిఫ్ట్‌గా కూడా ఇవ్వొచ్చు.

ఆకు జంతువు

హాయ్ నేస్తాలూ! ఈ వారం మీకోసం ఎలుక బొమ్మను తీసుకొచ్చాం చూశారాగా. మీరు కూడా ఇలాంటి ఆకారాలున్న ఆకులను తీసుకుని ఎలుకను తయారు చేయండేం.



1 ఎరుపు 2 నారింజ 3 పసుపు 4 కాఫీకలర్ 5 ఆకుపచ్చ 6 నీలం

రంగులేద్దామా...

పదాలు రాసేద్దాం!

పిల్లలూ... ఇక్కడి చక్రంలో కొన్ని ఇంగ్లీషు అక్షరాలు కనిపిస్తున్నాయి కదూ. మీరేం చేయాలంటే వాటితో కొన్ని పదాలు రాయాలి. ప్రతి పదంలోనూ మూడు అక్షరాలుండాలి.





కవలలు ఏవి?

నేస్తాలూ! చూశారుగా ఇక్కడ ఆరు సింహం తలలున్నాయి. వాటిలో రెండు మాత్రం కవలపిల్లల్లాగా ఒకేలా వున్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

దారి చెప్దామా...



ఎలుగుబంటి ఎక్కడ?

పిడుగులూ...ఈ బొమ్మలో ఒక జంతువు దాక్కొని వుంది. అది ఎక్కడుందో వెతికి కనిపెట్టండి.

నేర్చుకుందాం



జవాబులు

కవలలు ఏవి?: 2,5

ఎలుగుబంటి ఎక్కడ?
పుస్తకం తిప్పి చూడండి. సరిగ్గా మనిషి వెనక మంచు కొండల కింద వుంది. కనిపించిందా!

అట్టమీది కథ

జాతి గీతిక... దేశానికి ప్రతీక...

- కె.సాహిల్

సువిశాల భారతదేశంలో ఆ గీతం గురించి తెలియనివారుండరు. ప్రతిరోజూ దాన్ని ఆలపించకుండా బాల్యం గడవనే గడవదు. పైగా పాడుతుంటే ఏదో తెలియని దేశభక్తి, ఉత్తేజం, ఉత్సాహం మన మనసుల్లోకి జొరబడుతుంది. అదే మన జాతీయగీతం 'జనగణమన'. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, రాష్ట్రాలు వున్న ఇంత పెద్ద దేశంలో ఒక పాటను జాతీయగీతంగా ఎంపిక చేసుకోవడం చిన్న విషయం కాదు. ఆ గేయంలో ఎంతో సువిశాలభావం, సౌభ్రాతృత్వం, సామరస్యం వుంటేనే సాధ్యమౌతుంది. అవన్నీ అక్షరాక్షరాన నింపుకుంది కాబట్టే బెంగాలీ కవి రవీంద్రనాథ్ టాగూర్ కలం నుంచి జాలువారిన 'జనగణమన'కు ఆ అపురూప గౌరవం లభించింది. జాతి యావత్తు సగర్వంగా చెప్పుకునే జాతీయగీతం... గురించిన పలు ఆసక్తికర అంశాలు ఈ వారం అట్టమీది కథలో తెల్సుకుందాం. సందర్భం వచ్చింది కాబట్టి ఇతర దేశాల జాతీయ గీతాల గురించి కూడా రేఖా మాత్రంగా....

జన గణమన అధినాయక జయహే
భారత భాగ్యవిధాతా
పంజాబ సింధు గుజరాత మరాఠా
ద్రావిడ ఉత్కళ వంగ
వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛల జలధితరంగ
తవ శుభ నామే జాగే తవ శుభ ఆశిషమాగే
గాహే తవ జయ గాథా
జనగణ మంగళ దాయక జయహే
భారత భాగ్య విధాతా
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!

బెంగాల్ భాషలోని పద్య రూపంలో వున్న జాతీయ గీతానికి అర్థం తెలుసుకుందామా!

జనులందరి మనస్సులకూ అధినేతవు. భారత భాగ్య విధాతవు అయిన నీకు జయమగుగాక. పంజాబు, సింధూ, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడ, ఉత్కళ, వంగ దేశాలతోనూ, వింధ్య హిమాలయ పర్వతాలతోను, యమునా గంగ ప్రవాహాలతోనూ, ఉవ్వెత్తుగా లేచే సముద్ర తరంగాలతోనూ శోభించే ఓ భారతభాగ్య విధాతా! వాటికి నీ శుభనామం ఉద్బోధ కలిగిస్తుంది. అవి నీ ఆశీస్సులు అర్థిస్తాయి. నీ జయగాథల్ని గానం చేస్తాయి. సమస్త జనులకూ మంగళ ప్రదాతవు, భారతభాగ్య విధాతవు అయిన నీకు జయమగుగాక! జయమగుగాక! జయమగుగాక!

అసలు ఈ గేయాన్ని చదువుతుంటేనే ఏదో తెలీని పారవశ్యం మనల్ని ఆవహిస్తుందికదూ. అదే జాతీయగీతంలో వున్న ప్రత్యేకత. దీన్ని రవీంద్రనాథ్ టాగూర్ బెంగాలీ భాషలో రచించాడు. దీన్ని భారత రాజ్యాంగ పరిషత్తు 1950 జనవరి 24వ తేదీన ఆమోదించింది. దీనిని ప్రప్రథమంగా 1911

డిసెంబర్ 27వ తేదీన కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు. పూర్తి జాతీయగీతాన్ని ఆలపించడానికి 52 సెకండ్లు పడుతుంది. కొన్ని సందర్భాలలో జాతీయ గీతం మొదటి, చివరి పంక్తులను మాత్రమే పాడతారు. సంక్షిప్త రూపంలో గానం చేయడానికి 20 సెకన్లు పడుతుంది.అయితే మనదేశంలో భిన్న భాషల్లో ఆలపించడం వల్ల ఉచ్చరణలో తేడాలు కనిపిస్తుంటారు.



అనువాదం, ఆలాపన అక్కడే...

రవీంద్రుడు 'జనగణమన' గేయానికి స్వరాలు కూర్చింది మన రాష్ట్రంలోనే. అదీ చిత్తూరుజిల్లా మదనపల్లిలోనే అని తెల్సా! అదెలా జరిగిందో చూద్దాం.

పశ్చిమ చిత్తూరులోని పురాతన, చిన్ని పట్టణం మదనపల్లి. సరిగ్గా తొంభయ్యేళ్ల క్రితం 1919లో తన స్నేహితుడు, ఐరిష్ కవి, అనిబిసెంట్ థియొసాఫికల్ కాలేజ్ (బి.టి కళాశాల) ప్రిన్సిపాల్ జేమ్స్ కుషన్స్ నుంచి టాగూర్‌కు ఆహ్వానం అందింది. ఆ ఆహ్వానం మేరకు ఆయన మదనపల్లిలోని బి.టి.కాలేజ్‌కు విచ్చేశారు. అక్కడే కొద్ది రోజులు గడిపారు కూడా. అప్పుడు కుషన్ విజ్ఞప్తి మేరకు జనగణమన గేయాన్ని ఆలపించారు టాగూర్. అక్కడి విద్యార్థులు కూడా గొంతు కలపడంతో ఆ పరిసరాలలో గీతం ప్రతిధ్వనించింది. ఆ సందర్భంగానే ఆ గీతాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు టాగూర్. అదే మన జాతీయగీతంగా గుర్తింపు పొందింది. నేడు టాగూర్ మన మధ్య లేకపోయినా మదనపల్లిలో ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ వున్నాయి. బి.టి కళాశాల గ్రంథాలయం గోడలకు టాగూర్ స్వదస్తూరీతో వున్న జాతీయగీతం ఆంగ్ల పాఠం వేళ్లాడుతూ పలుకరిస్తుంది. అయితే రవీంద్రుడు బసచేసిన కుటీరం మాత్రం పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరుకోవడం మాత్రం బాధగా అనిపిస్తుంది.

వివాదం

మనం జాతీయ గీతంగా స్వీకరించిన 'జనగణమన'ను రవీంద్రుడు ఇంగ్లండ్ రాజు (ఐదవ జార్జి), రాణి మన దేశం వచ్చినప్పుడు వారిని శ్లాఘిస్తూ రాశాడని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. జాతీయగీతంలోని 'అధినాయక' మరెవరో కాదని ఐదవ జార్జి అని అంటుంటారు. మనం భావిస్తున్నట్టు ఇది మాతృభూమిని శ్లాఘిస్తూ రచించినది కాదని కూడా అంటారు. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ వారు 'వందేమాతరం'ను బలపరుస్తూ 'జనగణమన'పై దాడి చేస్తుంటారు. రాజ్యాంగ పరిషత్తు రెంటినీ పరిశీలించి బాగా లోతుగా చర్చించి చివరికి దీన్ని ఎంపిక చేసింది. 'వందేమాతరం'లో కొన్ని భాగాలు మతతత్వ పూరితంగా వుండడమే ఇందుకు కారణం. ఇక 2005లో అయితే ఈ విషయమై ఏకంగా కోర్టులో కేసే నడిచింది. గేయంలోని 'సింధ్' ని తీసేసి 'కాశ్మీర్' చేర్చాలన్నారు.

ఎందుకంటే సింధ్ ప్రాంతం భారతదేశంలో భాగంగా ఎక్కువకాలం లేదు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు అది పాక్‌లో భాగమైంది. కాబట్టి ఆ పదం తీయాలన్నారు. అయితే సువిశాల సంస్కృతిలో భాగమైన సింధూ నాగరికతకు మన దేశంలో ఎంతో ప్రాధాన్యత వుంది. దాని ప్రతిరూపమే సింధు. కాబట్టి దాన్ని తీసేయాల్సిన ఆవశ్యకత మాత్రం లేదని కొందరు వాదించారు. మార్పు చేయనక్కర్లేదని కొత్త పదాలు తగిలించనవసరం లేదని సుప్రీంకోర్టు చెప్పాకే వివాదం సద్దుమణిగింది. అయితే రవీంద్రుడు ఆకాలంలోనే తన రచనల ద్వారా సామ్రాజ్యవాదాన్ని, ఫాసిజాన్ని తిరస్కరించాడు. రష్యాను సమర్ధించాడు. జలియన్‌వాలాబాగ్ మారణహోమం తర్వాత బ్రిటీష్ వారిచ్చిన 'సర్' బిరుదును సైతం తిరస్కరించాడు.

రవీంద్రుని గురించి ....

ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశానికి జాతీయగీతాన్ని అందించిన రవీంద్రనాథ్ టాగూర్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన గొప్ప కవి, ఉత్తమ కథకుడు, మంచి నవలాకారుడు, ప్రతిభావంతుడైన సంగీతకర్త, ప్రజ్ఞావంతుడైన నర్తకుడు, చక్కటి చిత్రకారుడు. అన్నిటినీ మించి మంచి తాత్వికుడు. మన దేశానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి సాధించిన ప్రప్రథముడు. బెంగాలీ, ఇంగ్లీష్‌తో పాటు ప్రాకృత భాషలలోనూ గొప్ప పాండిత్యం వుండాయనకు. ప్రామాణిక రూపంలో 150 కథలను అందించిన ఘనత ఆయనది. వీటిలో ఎన్నో సంచలనాలు సృష్టించాయి. ఇందులో చెప్పుకోవాల్సిన కథ 'స్త్రీర్ పత్ర' (భార్యకు ఉత్తరం). కథలోని మృణాళ్ అనే యువతి పాత్ర ద్వారా పెత్తందారీ వివాహవ్యవస్థను ఖండిస్తారాయన. ఇంతేకాదు. 2,230 గీతాలు రచించి వాటికి బాణీలు కట్టి ఆలపించారు. ఇటువంటి కళాకారుడు అప్పుడు లేదు. ఇప్పుడూ లేదు. తను బెంగాలీ భాషలో రచించిన గీతాలకు ఆంగ్లానువాదమే 'గీతాంజలి'. దీనికే నోబెల్ బహుమతి లభించింది. ఇందులోని మొట్టమొదటి గీతం 'వేర్ ద మైండ్ ఈజ్ విదౌట్ ఫియర్' ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఆయన రాసిన ఎనిమిది నవలలూ, నాలుగు నవలికలు దాదాపు భారతీయభాషలన్నిటిలోకి అనువాదమయ్యాయి. టాగూర్ నవల 'నష్టానీర్' సంచలనం రేపింది. సత్యజిత్‌రే రూపొందించిన 'చారులత' చిత్రానికి

జాతీయ గీతం అంటే...

ఒక దేశం (జాతి) యొక్క ప్రాధాన్యతకు సంగీతాన్ని అద్ది జాతికి అందించేదే జాతీయగీతం. ఇది ఆ దేశ చరిత్ర, సంప్రదాయాలు, ప్రజాపోరాట స్ఫూర్తితో నిండివుంటుంది. కొన్ని దేశాలు దీనికి సంగీతస్వరాలను అధికారికంగా సమకూర్చుకుంటే మరికొన్ని అనధికారికంగా ఏర్పాటుచేసుకుంటాయి. కొన్ని దేశాల జాతీయగీతాలు పేర్లను, స్వీకరించిన సంవత్సరాలు చూస్తే...

దేశం	జాతీయగీతం పేరు	స్వీకరించిన సంవత్సరం
అమెరికా	మెర్ హెరెనిక్	1991
ఆస్ట్రేలియా	అడ్వాన్స్ ఆస్ట్రేలియా ఫెయిర్	1984
బంగ్లాదేశ్	అమర్ సోనార్ బంగ్లా	1972
భూటాన్	డ్రక్ సెంధెన్	1953
ఈజిప్టు	బిలేడీ బిలేడీ బిలేడీ	1979
ఫ్రాన్స్	లా మార్సలైజ్	1795
ఇరాన్	సొరౌద్ ఇ మెల్లి ఇజామౌరి	
	ఎ -ఇస్లామి-ఎ-ఇరాన్	1990
ఇరాక్	మాటిని	2004
ఇటలీ	ఇల్ కాంటో డెగ్లి ఇటాలియని	1946
జపాన్	కిమి గ యో	1999
మలేసియా	నెగరకు	1957
పాకిస్తాన్	ఖ్వామి తరానా	1954
శ్రీలంక	శ్రీలంక మాత	1951



మదనపల్లిలో రవీంద్రుడు బస చేసిన కుటీరం



మదనపల్లిలో జాతీయగీతాన్ని ఆలపించిన ప్రదేశం

మూలాధారం ఆ నవలే. జాతీయోద్యమ నేపథ్యంలో ఆయన రాసిన 'ఘరే బైరే' నాటికను సత్యజిత్ రే అదే పేరుతో సినిమా తీశారు. ఆ చిత్రంలోని గిరీష్ బాబు మన గిరీశంలాగే సంఘసంస్కర్త. అంతే కాదు. జాతీయోద్యమంలో అప్పట్లో పొడచూపిన అవాంఛనీయ ధోరణులను టాగూర్ తీవ్రంగా ఖండించారు.

ఆయన రచించిన రెండు పాటలు (జనగణమన, అమర్ సోనార్ బంగ్లా) రెండు దేశాలకు (భారత్, బంగ్లాదేశ్) జాతీయ గీతాలుగా ఎంపిక కావడం మరెవరికీ దక్కని అపురూప గౌరవం. పైగా ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి (సాహిత్యంలో) అందుకున్న తొట్ట తొలి భారతీయుడు కూడా రవీంద్రుడే కావడం మనకు గర్వకారణం.

ప్రాచీన జాతీయగీతాలు

ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీన జాతీయగీతం డచ్ జాతీయగీతం. 'హెట్ విహెల్మస్'. 1568-1572 మధ్యలో డచ్ తిరుగుబాటు సందర్భంగా దీనిని రచించారు. జపాన్ జాతీయ గీతాన్ని హెయన్ కాలంనాటి (794-1185) పద్యం నుంచి తీసుకున్నారు. కానీ 1880 వరకు దీనికి స్వరాలే సమకూర్చలేదు.

సాధారణంగా ఆయా దేశాల ప్రధాన భాషలో జాతీయగీతం వుంటుంది. అయితే కొన్ని దేశాలు మాత్రం ఇందుకు మినహాయింపుగా వున్నాయి. ఉదాహరణకు భారతదేశ జాతీయగీతం మొదట 'జనగణమన' బెంగాలీ భాషలో వుండేది. తర్వాత రచయితే దాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు. అయితే ఇక్కడి రాష్ట్రాలు తమ ప్రాంతీయ భాషలో దాన్ని ఆలపిస్తాయి. స్విట్జర్లాండ్ దేశానికి నాలుగు భాషల్లో (ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, రోమన్) జాతీయగీతాలున్నాయి. కెనడాకు కూడా రెండు (ఇంగ్లీషు, ఫ్రెంచి) జాతీయ గీతాలున్నాయి. కొన్ని ప్రత్యేక సందర్భాలలో రెంటిని కలిపి కూడా పాడతారు. దక్షిణాఫ్రికన్లు మాత్రం ఒకే జాతీయ గీతాన్ని ఐదారు భాషల్లో ఆలపిస్తుంటారు.

ఏదేశానికైనా జాతీయగీతం ఎందుకు? అది ఆ ప్రజల సమైక్యతకు సంకేతం. చైతన్య సంగీతం కనుక. జాతీయ పతాకంలాగే అది కూడా ఒక ప్రతీక.

★

కిమిగయో

జపాన్ సైన్యం తొలి బ్యాండ్ మాస్టర్‌గా వున్న ఆంగ్లేయుడు జాన్ విలియమ్ ఫెంటన్ 1860లో దీనిని స్వరపరిచారు. 1881వ సంవత్సరం వరకు దీనినే ఆలపించారు. ఆ తర్వాత మరింత ఆకట్టుకునేవిధంగా స్వరాలను సమకూర్చుకునేందుకు ఒక కమిటీ ఏర్పడింది. చివరికి సంగీతకారుడు ఒకూ యోషిష రూపొందించిన బాణీని ఎంపిక చేశారు. అయితే దీన్ని కూడా మరింత మెరుగు పర్చాలన్సిన అవసరముందని భావించారు. జర్మన్ బ్యాండ్ మాస్టర్ ఫ్రాంజ్ ఎకర్ట్ ఆ బాణీని మరింత పరిపుష్టం చేశారు. దీన్ని తొలిసారిగా చక్రవర్తి 'కిమిగయో' జన్మదినాన (1880లో) ఆలపించారు. అయితే దానికి జపాన్ జాతీయగీతంగా ఆమోదించింది మాత్రం 1999, ఆగస్టు తొమ్మిదినే.

మార్చ్ ఆఫ్ ది వలంటీర్స్

ఇది చైనా జాతీయగీతం. జపాన్ దురాక్రమణ జరిపినప్పుడు తమ దేశాన్ని కాపాడుకోడానికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిలబడిన వలంటీర్లకు అంకితమిచ్చిన గేయం ఇది. టియాన్ హన్ రచించిన గేయానికి నై ఎర్ 1935లో సంగీతాన్ని అందించాడు. విదేశీ దురాక్రమణదారులనుంచి మాతృదేశాన్ని కాపాడుకోడానికి చైనీయులు ప్రదర్శించిన సాహసకృత్యాలను ఈ గేయం వర్ణిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధ సందర్భంగా జపాన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన చైనీయులకు సంఘీభావం తెల్పుతూ పలుదేశాల ప్రజలు ఈ పాటను ఆలపించారు. 1949వ సంవత్సరంలో దీన్ని 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' జాతీయ గీతంగా ఎంపిక చేశారు.

గాడ్ సేవ్ ద క్వీన్

ఇది ఇంగ్లండ్ జాతీయగీతం. అయితే ఈ దేశానికి అధికారిక జాతీయ గీతం లేదు. సాధారణంగా బ్రిటన్, కామన్‌వెల్త్ జాతీయ గీతం 'గాడ్ సేవ్ ద క్వీన్'నే ఉపయోగిస్తుంటారు. అంతర్జాతీయ పుట్‌బాల్ పోటీలు, అంతర్జాతీయ రగ్బీ పోటీల సందర్భంగా కూడా ఈ గేయాన్నే ఆలపిస్తుంటారు.

లా బయోమెసా

క్యూబా జాతీయగీతమిది. దీని రచయిత, స్వరకర్త పెడ్రో ఫిగరెడో. స్పానిష్ నిరంకుశులకు వ్యతిరేకంగా పోరాటం చేశాడీయన. 1868లో జరిగిన 'బయమో పోరాటం'లో విప్లవశక్తులకు నాయకత్వం వహించాడు. ఈ పోరాట సమయంలో పొందిన స్ఫూర్తితోనే 'లా బయోమెసా' గీతాన్ని రచించి స్వరపరిచాడు. అయితే ఆయన 1870లో శత్రువులు పట్టుకుని ఖైదు చేసి ఉరిశిక్ష విధించారు.

అమర్ సోనార్ బంగ్లా

బంగ్లాదేశ్ జాతీయగీతమిది. దీన్ని 1906వ సంవత్సరంలో రవీంద్రనాథ్ టాగూర్ రచించి స్వరపరిచారు. అయితే జాతీయ గీతంగా బంగ్లాదేశ్ (అవతరించిన కొద్దికాలానికి) దాన్ని 1972లో స్వీకరించింది. 'సోనార్' అంటే 'బంగారంతో చేసిన' అని అర్థం. బెంగాల్ విభజన సందర్భంగా టాగూర్ ఈ గేయాన్ని రచించాడు. దీన్ని ఆంగ్లంలోకి అనువదించింది మాత్రం సయ్యద్ అలి అసన్.

సొరకాయ ఇగురు

కావలసిన వస్తువులు

సొరకాయ - 1 చిన్నది
ఉల్లిపాయ - 1 పెద్దది
నూనె - 1 గరిట
పచ్చిమిరపకాయలు - తగినన్ని
అల్లం - చిన్న ముక్క
పోపుసామాను - 2 టేబుల్ స్పూన్లు
కరివేపాకు - 2 రెమ్మలు
ఉప్పు - తగినంత

తయారుచేయు విధానము

సొరకాయ చెక్కు తీసి సన్నగా తరిగిపెట్టుకోవాలి. ఉల్లిపాయ కూడా సన్నగా తరిగి పెట్టుకోవాలి. అల్లం, పచ్చిమిరపకాయలు ముద్ద చేసుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు సన్నగా కోసి పక్కన పెట్టుకోవాలి. పొయ్యిమీద బాండీపెట్టి నూనె వేసి కాగిన తరువాత పోపు పెట్టుకోవాలి. ఇందులోనే ఉల్లిముక్కలు కూడా వేసి ఒక నిమిషం వేగనివ్వాలి. అందులో సొరకాయ ముక్కలు వేసి కాస్త వేగిన తరువాత అల్లం పచ్చిమిరపకాయల ముద్ద; ఉప్పు వేసి వేయించుకోవాలి.

(వేసవికాలంలో సొరకాయలో ఎక్కువ నీరుండదు. తరిగిన ముక్కలు మామూలుగా వేసుకోవచ్చు. అదే వర్షాకాలం గానీ, శీతాకాలం గాని అయితే ఆ ముక్కలలో ఉప్పువేసి బాగా పిండుకోవాలి.)





గోరుచిక్కుడు కందిపప్పు కూర

కావలసిన వస్తువులు

గోరుచిక్కుడు కాయలు - 1/2కిలో
ఉప్పు - సరిపడా
కందిపప్పు - కప్పున్నర
నూనె - పెద్దగరిట
ఉల్లిపాయలు - 2
పోపుసామాను - 2స్పూన్లు
కరివేపాకు - 2 రెమ్మలు
పచ్చిమిర్చి - కారం సరిపడా

తయారుచేయు విధానము

గోరుచిక్కుడు కాయలను సన్నముక్కలు చేసి కొంచెం ఉప్పువేసి ఉడికించి పక్కన పెట్టుకోవాలి. అలాగే కందిపప్పుకూడా బద్ద బద్దగా ఉడికించి నీళ్లువంచి పక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి కూడా చిన్నముక్కలు చేసి పెట్టుకోవాలి. బాండీలో నూనె కాగిన తరువాత పోపు పెట్టుకోవాలి. అందులోనే కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి కాస్త వేగనివ్వాలి. తరువాత పచ్చిమిర్చి ముక్కలు వేసి, చిక్కుడుకాయ ముక్కలు, కందిపప్పు వేసి వేయించుకోవాలి. సరిపడా ఉప్పువేసి కొంచెం నీళ్లు చల్లుకొని పొడిపొడిగా అయ్యేవరకూ వేయించుకోవాలి.

చామదుంప వేపుడు

(పచ్చి మిర్చి + అల్లంతో)

కావలసినవి వస్తువులు

చామదుంపలు - 1/2 కిలో
పచ్చిమిర్చి - 5
ఉప్పు - తగినంత
అల్లం - అంగుళం ముక్క
నూనె - చిన్న నేతి గిన్నెడు
కరివేపాకు - రెండు రెమ్మలు

తయారుచేయు విధానం

చామదుంపలు శుభ్రంగా కడిగి ఉడక పెట్టుకోవాలి. ఇవి మెత్తగా ఉడికిన తరువాత పొట్టుతీసి పక్కన పెట్టుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, ఉప్పు మెత్తగా నూరి పక్కన పెట్టుకోవాలి. బాండీలో నూనె వేసి కాగిన తరువాత దుంపలు వేసి బాగా వేయించుకోవాలి. ఇవి వేగేటప్పుడు అట్లకాడతో కొడుతూ వేయిస్తే మెత్తగా ముక్కలు ముక్కలుగా అవుతాయి. అల్లం మిర్చి ముద్ద కూడా వేసి బాగా పొడిగా అయ్యే వరకూ వేయించుకోవాలి.



కాకరకాయల వేపుడు

కావలసిన వస్తువులు

కాకరకాయలు - 1 కిలో
కరివేపాకు - 5 రెమ్మలు
ఉల్లిపాయలు - 1/4 కిలో
నూనె - నేతి గిన్నెడు
ఉప్పు - సరిపడా
జీలకర్ర - టీస్పూను
ఎండుమిరపకాయలు - కారానికి సరిపడా



తయారుచేయు విధానం

కాకరకాయలు రెండు చివరలు కోసుకొని మజ్జిగలో గాని, చింతపండులో గాని ఉడికించి పెట్టుకోవాలి. నూనెలో వేయించిన ఎండు మిరపకాయలు, ఉల్లిపాయలు, జీలకర్ర, కరివేపాకు, ఉప్పు వేసి మెత్తగా దంచి పక్కన పెట్టుకోవాలి. ఉడికించిన కాకరకాయలను పక్కకు తీసుకొని వాటిని చీల్చి నూరిపెట్టుకొన్న కారాన్ని వాటిలో కొంచెం కొంచెం కూరాలి. అన్నీ కూరుకున్న తరువాత బాణలిలో నూనె వేసుకొని కాగిన తరువాత నాలుగు నాలుగు కాయలు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. అన్ని కాయలు అలా వేయించుకోవాలి. నూనె కొంచెం ఎక్కువ లేకపోతే మాడిపోయే అవకాశముంది.

కవిత్వమ్

ప్రశ్నార్థకం

- దాకరపు బాబూరావు

ఈ లోకానికి భయపడే కదా అమ్మా!
నీలో ఓ నెలెక్కువ దాక్కున్నాను?!
నీ ప్రేమ పాశంతో ఈ లోకాన్ని చూసైనా
భయాల వాకిళ్ళ ముంగిట ఆశల ముగ్గు నౌదామనుకుంటే
నా చుట్టూ గీయబడిన ఆంక్షల లక్ష్మణరేఖల్లో విలవిల్లాడుతూనే... ఒదిగి ఒదిగి వున్నా...

కలల రెక్కల్ని కత్తిరించి
ఎగరలేని అశాంతి కపోతాన్ని చేసిన
మేల్ డామినేషన్ ఐరన్ కర్టెన్ దీక్షల్లో
నన్నే వికసించని కోరికల మొగ్గల
బోన్సాయ్ మొక్కని చేసి నిలబెట్టిన మానవ నిర్వాకంలో...



నిండా నూరుశాతం జీవితాన్ని శ్వాసించాలని
ఆశల చివుళ్ళ తొలకరినౌదామని చూస్తుంటే
రాజకీయ వధ్య శిలలపై ముప్పైమూడు శాతం ముసుగులో
ఆవిష్కరించబడని శిల్పంలా నను నిలబెట్టినా...

ఆశల దీపంలా వెలిగిన పుట్టింట్లోనే కాందిశీకురాల్నై
హక్కుపత్రాల్లేని ఆడపిల్లనై
అభద్రతా ఆలోచన్ల వేదిక మీద
ప్రేమోన్మాద ఆమ్ల (కామ) వర్షంలో నిలువెల్లా కాలిపోతూ
యాంత్రికత్వపు జీవితానై లోలోపల మరుగుతున్న లావాని
పొంగని దుఃఖనదుల్లో ఓదార్చుకుంటూ నిలబడుంటే...

నేతెచ్చుకొన్న అందాలు
నామీదకే నే విసిరేసుకున్న బూమ్‌రాంగుల్లా నాచుట్టూ పుట్టినవారే -నాతో కలసి పెరిగినవారే
మదపుమృగాలై నను చుట్టుముట్టిన శతృదేశ సైనికుల్లా రూపాంతరమై దాడులు నిర్వహిస్తోంటే
అమ్మా ! నీనుంచి వేరుపడి ఈ లోకానికి రావటానికి
నా భయం నిజం కాదంటావా?

తాజ్‌మహల్

ఎస్. వేణుగోపాల్



తరతరాల చరిత్రలో
భారతమాతకు కీర్తి కిరీటం
అలనాటి ఆభరణం
అనంత ప్రేమకు ఆధారం
చెరగని ప్రేమకు చెరమాంకం!
నివ్వెరపోయే నిర్మాణం
అబ్బురపరచే ఐశ్వర్యం!
నింగికెగసిన నీరాజనం

నిరంతర శ్రమకు నిదర్శనం!
వన్నె తగ్గని వైఢూర్యం
వలపు విలువల మణిహారం
వితండవాదుల విడ్డూరం!
తరగని చరిత్రకు
చెరగని చిహ్నం
తరాలు తరలిపోయినా
తనువుల పులకింతే
ఈ తాజ్‌మహల్ తిలకింత!
పర్యాటకుల ఆర్తికి
అలుపెరుగని స్ఫూర్తి
కరిగిపోని కళాజగతికి
చెరగనిపోని నిదర్శనం!

క్రైమ్ కథ

మెడకు చుట్టుకున్న కేసు

- యర్నాగుల సుధాకరరావు

"ఇప్పుడు నాభార్య విషయం ఎందుకు సార్ ? ఆమె యాక్సిడెంటులో చనిపోయిందని పంజాబ్ పోలీసులు కేసు అప్పుడే మూసేసారు. ఆమెది గాభరాపడేతత్వం. రోడ్డు దాటుతుండగా లారీకి ఢీకొట్టి ఘోరంగా తల నుజ్జుయి మరణించింది. అప్పుడే నేను ఇండియాలో నెల రోజులు చావుబతుకులమధ్య కొట్టుమిట్టాడాను. ఆమె లేకుండా నేను బతకలేను. చివరికి మళ్లీ లండన్ వచ్చాక నాభార్య బంధువుల వలన మనిషయ్యాను" చెప్పాడు జగ్‌పాల్ సింగ్.

"నువ్వు స్కాట్‌లాండ్ పోలీసులతో ఎలా మెలగాలో ముందు తెలుసుకో! మేము ఏదైనా అనుమానించామంటే అందులో ఖచ్చితంగా ఏదో దాగిఉంటుంది. నీవు కేవలం భారతసంతతికి చెందిన బ్రిటన్ మహిళను పెండ్లిచేసుకోవడానికి మరో కారణం ఉంది. నీవు చట్టవిరుద్ధంగా లండన్‌లో అడుగుపెట్టావు. నీకు ఇక్కడ పౌరసత్వం కావాలి. అందుకే మంజీర్‌ను పెళ్లి చేసుకున్నావు" పోలీసు అధికారి మెరుస్తున్న గాజుకళ్లతో గుచ్చి గుచ్చి చూస్తూ చెప్పాడు. జగ్‌పాల్‌సింగ్ అయోమయంగా చూసాడు.

"యూ మిస్టర్ ఎందుకలా తెల్లబోతావు. నీగురించి ఎంక్వయిరీ ప్రారంభిస్తే అన్ని కోణాల్లో చూస్తాం. నీవు దుర్మార్గమైన ఆలోచనలతో ఉన్నావు. నీభార్య ఎన్నో ఏళ్లగా ఇక్కడే సెటిల్ అయిన కుటుంబంలో పుట్టింది. అయినా భారతదేశపు కట్టుబాట్లుతో నడుచుకుంది. నీవు చేసిన హింసను ఏనాడూ తల్లిదండ్రులకు బంధువులకు చెప్పుకోలేదు"

"ఏమిటి సార్ ఇదంతా? నన్ను ఇక్కడ పౌరసత్వంతో బతకనిచ్చేట్లు లేరు. అనవసరంగా వచ్చి ఇక్కడ మీవంటివారితో హంతకుడని ముద్ర వేయించుకుంటున్నందుకు సిగ్గుపడుతున్నాను" ముఖాన్ని చేతుల్లో పెట్టుకుని బావురుమన్నాడు.

"ఏడ్చే మగాడిని నమ్మకూడదని మీసామెతలు చెబుతుంటాయి. నీవు నిరపరాధివి అయితే ఏమీకాదు. కానీ, నీవు భార్యను చంపావని నీచేష్టలు చెబుతున్నాయి. ఇంతకీ ఆదిశలో ఎందుకు ఎంక్వయిరి చేసామంటే నీవు ఈమధ్య ఇక్కడ మరో ఐరిష్ యువతితో ప్రేమలో పడ్డావు. ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. అంతవరకు ఒకే. అయితే ఐరిష్ యువతివద్ద పెద్ద ఎమౌంట్ బ్యాంకులోంచి డ్రాచేయించావు" అధికారి చెబుతుండగా మధ్యలో అందుకున్నాడు జగపాల్‌సింగ్

"యస్ నేను, ఐరిష్ యువతి పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాం. తప్పా? భార్య చనిపోతే జీవితాంతం మరొకామెను చేసుకోకుండా చావాల్సిందేనా?" చిరుకోపం ప్రదర్శించాడు.

"కూల్ డవున్ మిస్టర్. ఇంకా నేను మొదలుపెట్టనే లేదు. అప్పుడే చిందులేస్తావా ? మున్ముందు నీవు చాలా చిందులు, రాక్ఎన్‌రోల్ డాన్సులు ముమ్మరంగా వేయాల్సిఉంది" చెప్పి పకపకా నవ్వాడు అధికారి.

జగ్‌పాల్‌కు ఒక్కక్షణం స్కాట్‌లాండ్ పోలీసు కార్యాలయంలో ఉండాలనిపించలేదు. "సార్ మీ అనుమానాలతో మీరు ఏమైనా పరిశోధించుకోండి. నన్ను వదిలేయండి. నేను లండన్‌లోనే ఉంటాను. ఎటూ పారిపోను" అని కుర్చీలోంచి లేచాడు.

అప్పుడే వచ్చింది ఐరిష్ యువతి రోజ్‌లిన్. ఏకధాటిగా జగ్‌పాల్‌కోసం మాట్లాడింది. "అతడు నిర్దోషి. నేనే కావాలని నాడబ్బు డ్రాచేసుకున్నాను. తప్పా? నాడబ్బును అతడు ఆశించలేదు. ఈతడు నిరపరాధి. మంజీర్‌తో నాకు స్నేహం ఉంది. ఆమె ఈతనితో మంచి జీవితాన్ని గడిపింది. బాడ్‌లక్ ఇండియన్ రోడ్సు బావులేనందున యాక్సిడెంటు అయి చనిపోయింది"

"ఒకే జగ్‌పాల్‌ను వదిలేద్దాం. ఇండియా వెళ్లిన ఇద్దరుఆఫీసర్లను విషయం కనుక్కుందాం అని ఫోన్‌చేసాడు. అవతలివైపునుంచి వారు మాట్లాడారు.

"వ్వాట్ ఇండియాలో పంజాబ్ పోలీసులు నాలుకలు కొరుక్కున్నారా! మీరు మంజీర యాక్సిడెంటు కేసు తిరగతోడి అది హత్య అని నిరూపించగలిగారా? ఆమెను చంపి ఆతరువాత లారీ యాక్సిడెంటు చేసినట్లు ఆధారాలు లభించాయా? అక్కడ పోలీసులు ఆయాక్సిడెంటు కేసును తిరగతోడతామని మర్డర్‌కేసుగా నమోదు చేసారా?" అధికారి వెర్రిగా అరుస్తూ ప్రశ్నించి ఫోన్ పెట్టేసాడు. జగ్‌పాల్‌సింగ్ తలదించేసాడు. ఐరిష్ యువతి అర్థంకాక ఫోన్‌వైపు పోలీస్ అధికారివైపు చూసింది.

"ఇప్పుడు చెప్పు జగ్‌పాల్! స్కాట్‌లాండ్ పోలీసులు ఇంటరాగేషన్‌లోకి వెడితే నీవు బ్రతుకుతావనే గ్యారెంటీలేదు. సో నువ్వు ఏదీ దాచకుండా చెప్పేయ్. నీమేలుకోరి చెబుతున్నాను"

ఆమాటలకు జగ్‌పాల్ గుటకలు మింగి "సార్ నేను మీరు అనుకున్నట్టే మంజీరను బ్రిటన్ పౌరసత్వంకోసం పెండ్లి చేసుకున్నాను. అయితే నాకామె కొన్నాళ్లకే బోరుగా ఫీలయ్యాను. వదిలించుకోవాలనుకుని నానారకాల హింసలుపెట్టాను. ఇక్కడయితే పోలీసులకు దేగకళ్లతో చూస్తారు. అదే ఇండియాలో అయితే ఎన్ఆర్ఐల మాటలకు విలువనిస్తారు. తేలిగ్గా చంపేసి వదిలించుకోవాలనుకుని దీపావళికి మంజీరను ఇండియా తీసుకుని వెళ్లి ఆపండుగరోజు రాత్రి ఇంటిలో తలగడ దిండుతో ముఖంఅద్దేసి గాలిఆడకుండా చేసి చంపేసాను. ఆతరువాత కారులో తీసుకుని వెళ్లి కారు చక్రాలకింద ఆమె ముఖాన్ని నజ్జుచేసి నడిరోడ్డుమీద పడేసి ఆపక్కనే నేను తెలివి తప్పి పడిపోయాను. నాఫ్రెండు బలబీర్‌సింగ్ ఇందులో నాకు సాయపడ్డాడు. వాడే పోలీసులకు ఫోన్‌చేసి తన స్నేహితుడు, వాడి భార్య నాఇంటికి వచ్చి రోడ్డు దాటుతుండగా లారీ గుద్దుకుని ఆగకుండా వెళ్లిపోయిందని చెప్పాడు" చెప్పడం ఆపి ఐరిష్ యువతివైపు చూసాడు. ఆమె కళ్లు చింతనిప్పులయ్యాయి. అధికారి గద్దించేసరికి తిరిగి చెప్పసాగాడు.

అప్పుడు పోలీసులు బలబీర్ మాటలు నమ్మి మంజీర శవాన్ని పోస్టుమార్టమ్‌కు నన్ను హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసారు. నేను అక్కడ మంజీరకోసం తల బాదుకున్నాను. తల పగిలింది. దాంతో పోలీసు అధికారులు నాకు నచ్చజెప్పారు. వారు మంజీర కేసును యాక్సిడెంటుగానే పరిగణించి కేసు దర్యాప్తులో పెట్టి లారీకోసం వెతికారు. మంజీర పోస్టు మార్టమ్ రిపోర్టును బహుశా పట్టించుకోనందున యాక్సిడెంటుగా గుర్తించి చివరికి కేసు ఎత్తివేసారు"

"సో ఇలా నీవు మంజీరను వదిలించుకున్నావు. ఇక్కడ నీకో రహస్యం చెప్పాలి. నీవు క్రిమినల్‌వి. నీగురించి మేము ఎంక్వయిరీ చేయలేదు. ఇప్పుడు నీవు ప్రేమించే ఐరిష్ యువతి మమ్మల్ని మంజీర గురించి ఎంక్వయిరీ చేయమని కోరింది. అందుకు ఒప్పుకున్నాం. నిన్ను తెచ్చి ఇంటరాగేట్ చేసాం. నీవు చేసిన హత్యను నీచే చెప్పించడానికి ఇందాక ఫోన్‌లో మాట్లాడాను. అటువైపు ఎవరూ లేరు. మానుంచి ఎవరూ ఇండియా వెళ్లలేదు. ఇప్పుడు వెడతాం. మంజీర యాక్సిడెంటును హత్యకేసుగా మరలా తెరిపిస్తాం. ఎలా ఉంది మాపరిశోధన...." అధికారి సన్నగా నవ్వుతూ అడిగాడు. ఆమాటలకు జగ్‌పాల్ జుట్టు పీక్కున్నాడు.

ఐరిష్ యువతి ఒక్క అడుగు ముందుకు వేసి "మీభారతీయ కుటుంబాలవారు మాకాలనీలో ఉన్నారు. వారిని చూసి మేమెంతో గొప్పగా చెప్పుకునేవాళ్లం. మంజీర అసలుసిసలు భారతీయురాలు. నాతో భర్త చేస్తున్న హింసలు చెప్పుకునేది. ఆమె చనిపోయిన రోజుల్లో నేను ఇక్కడలేను. ఈ మధ్యనే వచ్చాను. నీతో లవ్‌లో ఉన్నట్టుగా పెళ్లివరకు వెళ్లాను. నీవు మంజీర మీద ఇప్పటికి ద్వేషంగా మాట్లాడుతున్నందున అనుమానించి పోలీసులకు దర్యాప్తు చేయమని కోరాను" అని చెప్పి తల తిప్పుకుని బయటికి నడిచింది. ★

చూద్దామా



ఆకట్టుకునే బస్తర్ అందాలు

బస్తర్ చూడాలంటే...బిలాస్‌పూర్ మీదుగా రాయపూర్ చేరుకోవాలి. బైలడిల్లా వెళ్ళే బస్సులో కంకారి చేరుకోవచ్చు. ఇది కూడా చాలా పెద్దవూరే. ఇది దూల్ నదీతీరాన వెలసిన చిన్న పట్టణం. ఎవరో మహారాజు కొంతకాలం నివసించినట్లు కొన్ని కట్టడాలు సూచిస్తున్నాయి. ఇక్కడ నుంచి దట్టమైన అరణ్యం. ఘాట్ రోడ్డు మీద వంకర టింకరగా తిరుగుతూ 4000 అడుగుల ఎత్తుకు చేరిన తరువాత సమతలంగా వుంది. అంటే బస్తర్ ప్రాంతం అంత ఎత్తులో వుంది. ఇక్కడ నుంచే ఈ ప్రాంతం చూడగలిగనంత చూడాలి. ఇది చత్తీస్‌ఘడ్‌లో వుంది.

నకులనార్

ఈ ప్రాంతంలో రైలు సంగతి మరచిపోయినా కనీసం బస్సు సౌకర్యం కూడా లేదు. ఒక్క బైలడిల్లాకు తప్ప. అదిగూడా ఇనుప ఖనిజం కొరకు ఏర్పడినది. అంతా దట్టమైన అరణ్యం. కొండజాతులవాళ్ళు, వీరి తండాల జీవితం చూడాలంటే మాత్రం నకులనార్ అనే చిన్న గ్రామానికి బయలుదేరాలి. 120 కిలోమీటర్ల అరణ్యంలో నడచి వెళ్ళాలి. అక్కడ ఇళ్లన్నీ కలిపి 15/20 దాకా వున్నాయి. ఇక్కడ పాములు విపరీతం. అన్నిరకాల పాములూ గుడిసెలలోకొస్తుంటాయి. చంపుతుంటారు. మనం వెళ్లినప్పుడు ఇక్కడ సంతలు జరుగుతోంటే మాత్రం తప్పకుండా చాడాలి. ఆదివాసులు ధాన్యం, గోధుములు, విప్పపువ్వు వంటివి తెచ్చి ఉల్లిపాయలు, ఉప్పు నూనె, బట్టలు వంటివి తీసుకుపోతుంటారు. వర్తకులు వీరినినేక విధాలుగా మోసం చేస్తుంటారు. ఇంత చలిలోగూడా ఇక్కడ స్త్రీలకు చిన్న చీర ముక్క తప్ప వేరే ఆచ్ఛాదన లేదు. మగవారి దగ్గర ఒక సొరకాయ బుర్రలో కల్లుగాని, విప్పసారాగాని తప్పనిసరిగా వుంటాయి. వారి చేతుల్లో రకరకాల ఆకృతులలో అందమైన గండ్రగొడ్డళ్ళుంటాయి. మధ్యాహ్నానికల్లా సంత దాదాపు అయిపోతుంది. ఆదివాసీలు అడవిలో కోడి పందేలు వేసి ఆనందిస్తున్నారు. పై పందేలు గూడా ఎక్కువే. కోడిపందేలు ఆనందించిన తరువాత వారంతా గుంపులు గుంపులుగా కూర్చుని సారాయి మజాలోపడుతుంటారు. తాగకపోతే చాలా మంచివారు. తాగితే ఏం చేస్తారో వారికే తెలియదు. వీరి ఆచారాలూ, కట్టుబాట్లూ, మనకు చాలా వింతగా కనిపిస్తాయి. లైంగిక సంబంధాలకు వయస్సుతో నిమిత్తంలేదు. పెండ్లి కాక ముందు తప్పులేదు. పెండ్లి తరువాత కట్టుబాట్లుంటాయట.

ఆదివాసీలలో ఒక ఆచారముంది. ఒకటి రెండు గ్రామాలకు చెందిన ఆడ, మగ పిల్లలు అడవిలో ఒక ప్రాంతానికి చేరుకుని రాత్రి అంతా అక్కడ తాగుతూ, తింటూ వినోదంగా గడుపుతారు. ఆ తరువాత ఒక కుర్రవాడు, కుర్రది గుంపును వదలి అడవిలోనికి పోతారు. ఇలా వెళ్ళిన జంటలకు పెండ్లి కుదిరినట్లు లెక్క. ఇది పౌర్ణమినాడు పండు వెన్నెలలో జరుగుతుంది. వీరికి మరో ఆచారం కూడా వుంది. ఒక కుర్రవాడు ఒక పిల్లను తెచ్చి తన ఇంట్లో పెట్టుకుంటాడు. అలా వారు కొన్నాళ్ళు గడుపుతారు. ఒక్కోసారి పిల్లలు కూడా పుడతారు. ఆ తరువాత పెండ్లి చేసుకుంటారు. ఇష్టం లేకపోతే మధ్యలోనే విడిపోతారు. ఆ పిల్ల మరొకరిని చేసుకుంటుంది. ఇది వారి లైంగిక జీవనం. అందరూ కష్టపడి పనిచేసి తిండి సంపాదించుకోవలసిందే. ఆస్తిపాస్తులు కూడా బెట్టుకోవటం లేదు. మగవాడే కష్టించి పోషించాలని లేదు. ఈ విధంగా ఎవరికి వారికే లైంగిక, సామాజిక స్వాతంత్ర్యాలు కూడా వున్నాయి. కానీ వాస్తవంగా ఆడవారే కష్టపడి ఏదో తెచ్చి మగవారిని పోషిస్తుంటారు. మగవారు త్రాగుతూ, తింటూ గడుపుతారు. అయితే అందరూ ఇలా కాదనుకోండి.

వీరి తగవులూ, పరిష్కారాలు కూడా విచిత్రంగా వుంటాయి. ఒకడి చెట్టు కల్లు మరొకడు తాగినా, ఒకడి కోడిని మరొకరు పట్టుకుని తిన్నా అలా చేసినావాణ్ణి చంపితీరుతానంటాడు. బాగా తాగినప్పుడే ఈ కలహాలన్నీ. అయినా వారు చిత్తుగా తాగని దెప్పుడు!

చిత్రకూట్

జగదల్‌పూర్‌కు 24 కిలోమీటర్ల దూరంలో వుంది చిత్రకూట్. ఒక్క ఆదివారం మాత్రమే బస్సు సదుపాయం వుంది. లేకుంటే అడవి దారే. ఒక ఆదివారం చిత్రకూట్ వెళ్ళాం. చాలా మంది పత్నీపుత్ర సమేతంగా తినుబండారాలతో పిక్‌నిక్‌కు వచ్చారు. ఇక్కడ ఇంద్రావతి నది ప్రవహిస్తోంది. దాదాపు 60 అడుగుల లోతున్న అగాధంలో పడుతున్న జలపాతం అద్భుతంగా వుంటుంది. ఈ నీటిలో ఒక ధార తెల్లగానూ, ఒక ధార పసుపు రంగుతోనూ వుంటుంది. నదీ గమనంలో ఏవేవో ఖనిజాలు కరిగి ఈ రంగు ఏర్పడి వుంటుంది. అందుకే ఈ నీటిని ఆరోగ్యప్రదంగా భావించి అందరూ స్నానాలు చేస్తారు. అంత ఎత్తు నుండి పడ్డ తాకిడికి పైకి లేచిన నీటి తుంపరులు పొగమంచులాగా ఆవరించి, దానిమీద ప్రసరించిన సూర్యకిరణాలతో ఏర్పడిన ఇంద్రధనస్సు ఒక మనోహర దృశ్యం. ఎగసిపడే ఈ మంచుమబ్బుతోపాటు కదలాడే ఈ రంగుల నాట్యం వైభవం ఒక అలౌకిక దృశ్యాన్నావిష్కరిస్తుంది. చుట్టూ కత్తితో కోసినట్లు నిటారుగా కిందికి దిగిన పర్వత సానువులు దట్టంగా అలుముకున్న అరణ్యం, జలపాతపు మంద్ర గంభీర నాదం తప్ప మరే శబ్దమూలేని ప్రశాంత వాతావరణం. ఇలా చూస్తున్న కొద్దీ ఈ ప్రకృతి యొక్క ఉదాత్త సౌందర్యం మనస్సును తాకుతుంది. ఈ సృష్టి ఎంత అగాధమో అంత ఉన్నతమూను. ఈ సృష్టిలో భాగమైన మానవ జీవితం కూడా అంత ఉదాత్తంగానూ, అంత ఉన్నతంగానూ ఉండాలని మనకు ప్రబోధిస్తున్నట్లుంటాయా పరిసరాలు. అందుకేమో! తపోధనులంతా అరణ్యాలనే ఎంచుకునేవారు.

దంతేవార్

జగదల్‌పూర్ 80కిలోమీటర్ల దూరంలో బైలడిల్లా రోడ్డుమీద దంతేవార్ అనే గ్రామముంది. ఇక్కడున్న దంతేశ్వరీ దేవి ఆదివాసులకు ఆరాధ్య దేవత, ఇక్కడ “సంకిని”, “డంకిని” అనే రెండు నదులు సంగమిస్తున్నాయి. ఇక్కడే దంతేశ్వరీ ఆలయాన్ని ఏనాడు నెలకొల్పారోగాని చాలా ప్రాచీనమైనది. చాలా పెద్ద ఆలయం. లోనికి వెళ్ళాలంటే లుంగీ మాత్రమే ధరించి వెళ్ళాలి. మన దగ్గర లేకపోతే ఇక్కడ లుంగీలుయిస్తారు. దేవీ సింహారూఢియై మహిసాసురమర్దిని రూపంలో వుంది. చాలా ఉగ్రరూపం. దసరా ఉత్సవాలకు యిక్కడ జంతు బలులిచ్చి ఆ రక్తం ఒక పాత్రలో వుంచుతారట. అరణ్యంలో నుండి ఒక సింహం వచ్చి ఈ రక్తం త్రాగి వెళుతుందని అన్నారు. యిక్కడ దేవినారాధించి మనసారా కోరిన కోరికలన్నీ నెరవేరుతాయని విశ్వాసం. ఇక్కడ ఆదీవాసీ తెగలలో విశేషమైన ప్రాధాన్యత సంతరించుకున్నదీ దంతేశ్వరీదేవీ. ఈ దేవి తరువాత ఈ తెగలు మహరాజ్ భంజదేవ్‌ని మాత్రమే కొలుస్తారు.

బకావంద్

ఈ గ్రామం చూడాలని వెళ్ళాము. దారిలో ఇంద్రావతి నదిని దాటాలి. ఇక్కడున్నవన్నీ చెక్క బ్రిడ్జిలే. మేము మోటర్ బైక్ మీద వెళుతుంటే ఏ క్షణానైనా నదిలో పడటం తథ్యమనిపించింది. నది దాటిన తరువాత 10 కిలో మీటర్ల దూరం వరకూ చిక్కని అరణ్యం. తరువాత పంటచేలు.

ఇక్కడ బ్లాక్ ఆఫీసు, ప్రైమరీ హెల్తు సెంటరూ ఉన్నాయి. వ్యవసాయాధారమైన గ్రామ జీవనమైనప్పటికి ఆధునికత ప్రభావం కొంత కనిపిస్తుంది. ఇక్కడకు 3 కిలోమీటర్ల దూరంలో ఒరిస్సా సరిహద్దు వుంది. ఈ మధ్య అటవీ ప్రాంతంలో ఎవరైనా ఒంటరిగా దొరికితే తన్ని అందిన వరకూ లాక్కుపోతున్నారట. ఇక నాగరిక జీవనం మొదలయినట్లే. ఇక్కడ ఆసక్తికరమైన విశేషాలేమీ కనిపించలేదు. గాని తిరిగి వెళ్ళాలంటేనే కష్టాలు మొదలౌతాయి. ఎంతోసేపు కాపు కాస్తే టాక్సీగా తిప్పుతున్న జీపు ఒకటి దొరుకుతుంది. కానీ వీళ్ళు రోడ్డునకాక అడవికి అడ్డంపడి బస్తర్ గ్రామం వెళుతున్నారు. ఈ కాలి బాటలు చాలా చోట్ల రెండు మూడుగా చీలిపోతాయి. ఎటుపోవాలో డ్రైవర్‌కు తెలియదు. లోపల కూర్చున్న వాళ్ళెటు పొమ్మంటే అటు పోతున్నాడు. ఈ చీకటిలో ఈ అరణ్యంలో ప్రయాణ ఏదో భయాన్ని రేకెత్తిస్తుంది. కొంత దూరం తరువాత లోపలున్న వాళ్ళుకు కూడా దారి తెలియదు. నెమ్మదిగా చివరకు బస్తర్ గ్రామం చేరుకుంటాం.

బస్తర్

ఇక్కడ కొద్దిపాటి అభివృద్ధి కనిపిస్తుంది. ఒక ఆసుపత్రి, ఐ.టి.ఐ ట్రైనింగ్ సెంటరు, రెండు హైస్కూళ్ళు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ట్రయినింగ్ సెంటరూ వున్నాయి. పెద్ద వూరేమీ కాదుగాని ప్రభుత్వ నిర్మించిన ఆదివాసీలు కాలనీలున్నాయి. ఈ రోజిక్కడ సంత జరుగుతోంది. ఆదివాసీలు బెల్‌మెటల్‌తో పోత పోసినవీ, ఇసుకరాతితో మలచినవీ, రకరకాల బొమ్మలు తయారుచేస్తారు. వీటిని స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్(ఎస్‌టిసి) వారు కొని పట్టణాల్లో విక్రయిస్తారు.

బస్తర్ స్వరూపం

బస్తర్ అంతా పర్వతాలూ అరణ్యమే. అక్కడక్కడ కుగ్రామాలూ, ఆదిమ తెగలు. ఈ ప్రాంతమంతా దండకారణ్యంలోని భాగమే. అసలు దండకారణ్యానికే ఒక పౌరాణిక కథ







ప్రచారంలో వుంది. రాక్షస జాతికి గురువు శుక్రాచార్యులవారు. ఆయన ప్రియపుత్రిక దేవయాని. శుక్రుడు ఆశ్రమంలో లేని సమయంలో దండుడు అనే రాజు ఆశ్రమానికి వచ్చి దేవయాని అందచందాలకు ముగ్ధుడై, ఆమె తిరస్కరిస్తున్నా, వారిస్తున్నా పశుబలంతో బలాత్కరించాడుట. ఆశ్రమానికి తిరిగి వచ్చిన శుక్రుడు తన కుమార్తెకు జరిగిన పరాభవానికి ఉగ్రుడై దండుని రాజ్యమంతా అరణ్యమైపోతుందని శపించాడట. అలా ఆవిర్భవించింది దండకారణ్యం. శ్రీరామచంద్రుడు వనవాసం చేసిన చోటిది, ఈ ప్రాంతమంతటికీ బస్తర్ అనే పేరున్నా బస్తర్ అనేది, ఇంతకు ముందు చెప్పినట్లు చిన్న గ్రామం మాత్రమే. ఈ ప్రాంతానికి కేంద్రం జగదల్‌పూర్. ఒకనాటి బస్తర్ రాజు భంజ్‌దేవ్ జగదల్‌పూర్‌లోనే వుండేవారు. బస్తర్‌కు ఒక ప్రక్క మన వరంగల్, ఖమ్మం జిల్లాలున్నాయి. జగదల్‌పూర్ నుంచి భద్రాచలం, వరంగల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు కూడా వుంది. అలాగే 250 కిలోమీటర్ల దూరంలోనున్న విశాఖపట్టణానికి, సాలూరు మీదుగా ప్రతి ఉదయం బస్సు వుంది. ఇదికాక కిరండేల్ రైలు ఎక్కినా విశాఖపట్నం చేరుకోవచ్చు.

ఇక్కడకు దగ్గరగా అభుజమాడ అనే ప్రాంతముంది. చుక్కలనంటుతున్న పర్వతశ్రేణి దీనితో పోటీపడుతూ పెరిగిన అరణ్యం. ఎవరికీ చూడశక్యం కానిది. ఇక్కడకు వెళ్ళాలంటే ముందుగా కలెక్టరుగారి అనుమతి కావాలి. ఇక్కడ ఆదిమానవుల లాంటి తెగలవారు నివశిస్తున్నారట. వారు దుస్తులు ధరించరు. వ్యవసాయం, వేట వారి జీవనాధారం. చిత్తుగా తాగటం నిత్యకృత్యం. ధనస్సు వారి ఆయుధం. బయటివారెవరైనా అక్కడ ప్రవేశించారని తెలిస్తే విషం పూసిన బాణాలతో కొట్టి చంపేస్తారుట. అందుకే అక్కడెవరికీ ప్రవేశం లేకుండా కట్టడిచేశారు. వారి మరో ప్రపంచం అలా పరిరక్షింపబడుతోంది.

సుమారు 50 సంవత్సరాల కిందట ఇక్కడ తిరుగుబాటు జరిగింది. ఇది స్వాతంత్ర్యానంతరం స్వదేశీ సంస్థానాల విలీనంనాటి సంగతి. వారికి మహారాజు పాలనే సమ్మతంకాని, ఈ నూతన వ్యవస్థల గురించి తెలియదు. వారికి మార్పు అనేది అంత సులభంగా అందుకునేదికాదు. వారి జీవన సరళి బలవంతంగా మారుతుందేమోననే శంక, వారిది సహించరు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసులందరూ జగదల్‌పూర్‌లోని మహారాజా భంజదేవ్ షీష్‌మహల్లో చేరి ఆయనకు తప్ప అన్యులకు తలవంచమని, ఆయనే తమ ప్రభువనీ, ధనస్సులు చేతబట్టి పోరాడారు. చివరకు పోలీసు కాల్పులు తప్పలేదు. దానిలో మూడు వేల మంది హతులయ్యారంటారు. ఈ పోరాటంలో మహారాజా భంజ్‌దేవ్ కూడా మరణించాడు. ఆయనకు సంతానం లేదు. ఆయన సోదరుడికిద్దరు కొడుకులు. అందులో ఒకరు పిచ్చివాడట. ఇలా ఆ రాజ వంశం అంతరించిపోయింది.

ఇక్కడ ప్రవహించే ఇంద్రావతినది ఎప్పుడూ ఎండదు. ఈ నది భోజపూర్ సమీపాన గోదావరితో సంగమిస్తుంది. బస్తర్ నుంచి వచ్చే కలప అంతా ఇంద్రావతి మీదుగా గోదావరికి తద్వారా రాజమండ్రికి చేరుకుంటుంది. ఈ చేరటం కూడా చిత్రంగా వుంటుంది. కలప మానులన్నీ తాటితో కట్టి ఒక ప్లాట్‌ఫారంలాగ తయారుచేస్తారు. దాని మీద కాపలా కొరకు ఒకరిద్దరు కూర్చుంటారు. దారిలో వంట చేసుకోవటానికి ఏర్పాటు చేసుకుంటారు. ఈప్లాట్‌ఫారం వెదల్లు వల్ల నీటిలో తేలుతూనే వుంటుంది. రాజమండ్రి వర్తకులు జగదల్‌పూర్ వచ్చినప్పుడు వారుండటానికి అన్ని వసతులతో కూడిన చక్కని భవంతి ఎన్నో గదులతో వుంది. కలప పాటలకు వారు వచ్చినపుడు తప్ప ఏడాది పొడవునా ఖాళీగానే వుంటుంది తప్ప ఎవరికీ ప్రవేశం లేదు.

బస్తర్‌లో పట్టు పరిశ్రమ గూడా వుంది. కాని చాలా ముతకగా వుంటాయా బట్టలు. మంచి పట్టే కాని పట్టు శుభ్రపరచటం, రంగులు, నేత బాగుండవు. ఈ బట్టలు కూడా ఎస్.టి.సి. వారే కొనుగోలు చేసి పట్టణాల్లో విక్రయిస్తారు. అంతకంటే ఈ పరిశ్రమలో వారికి సరైన శిక్షణ ఇచ్చి, పట్టుకు అందాలు కూర్చే విధానంలో వారిని తీర్చిదిద్దితే బట్ట నాణ్యతా పెరుగుతుంది. వారు ఆర్థికంగా లాభపడతారు.

చూసినంతదూరం పరచుకున్న పర్వతాలు, చిక్కగా అలుముకున్న అరణ్యం అపారమైన అటవీ సంపద మధ్యలో విచిత్రంగా తాండవించే దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం వీటినే మాత్రం లక్ష్య పెట్టకుండా తమ పరిధిలో సంతోషంగా జీవనం గడిపే ఆదివాసీలు ప్రకృతితో సన్నిహితంగా పెనవేసుకున్న వారి జీవితం, యిదంతా మరో ప్రపంచం లాగుంటుంది. ఆధునిక నాగరికతకు దూరంగా, ధన ప్రలోభానికి మరీ దూరంగా సాగుతున్న వీరి జీవన స్రవంతి, మనకొక మరపురాని అనుభూతిగా మిగిలిపోతుంది. ఈ పరిస్థితి నెమ్మదిగా మారుతోంది. తీవ్రవాద ప్రభావం, రాజకీయ చైతన్యం వీరినెదరికి తీసుకెళతాయో!

★

తెలుసా!

వార్తల ఉత్తరాలు

మొట్ట మొదటి వార్తా పత్రికలు ఇప్పటి పత్రికల లాగా వుండేవి కావు. ఉత్తరాలలో వార్తలను రాసి వాటిని ప్రజలకు సరఫరా చేసేవారు. వీటిని వార్తల ఉత్తరాలనవచ్చు. దూరంగా ఉన్న వారికి ఈ వార్తల ఉత్తరాలను పంపించేవారు. ప్రస్తుత పత్రికలకు కొంచెం దగ్గరగా వుండే పత్రికలను కీ.పూ 60లో జూలియస్ సీజర్ ప్రచురించాడు. న్యాయస్థానంలో ఈ పత్రికలను ప్రచురించడానికి అతనికి ప్రత్యేకమైన కార్యవర్గం వుండేది. వీటిలో ప్రధానంగా ప్రభుత్వ ప్రకటనలను ప్రచురించేవారు. దీనికి 'అక్టా డ్యూర్నా' అని పేరు. రోజు వారి సంఘటనలు అని దీనర్థం. వార్తా పత్రికలలో లేదా వార్త ఉత్తరాలలో మొట్ట మొదటి దాన్ని పదహారవ శతాబ్దంలో ఫగ్గర్స్ అనే ఆయన ప్రారంభించారు. వార్తలను సేకరించడానికి ఈయన ప్రత్యేకమైన విధానాన్ని ఆయన ప్రారంభించారు. వార్తలను సేకరించడానికి ఈయన ప్రత్యేకమైన విధానాన్ని ఏర్పరిచాడు. ఇదే కాలంలో వెనిస్‌లో ప్రభుత్వం వారు వీటిని నోటిజ్‌స్క్రీట్ అనేవారు. అంటే 'రాయబడిన వార్తలు' అనర్థం.

లండన్‌లో మొట్ట మొదటి వార్తా పత్రిక 1663లో ప్రచురించబడింది. దాని పేరు ఇంటిలిజెన్సర్. సమాచారం సేకరించడం, ఉత్పత్తి చేయడం రెండూ ఆ రోజుల్లో చాలా కష్ట సాధ్యం కనుకనే అప్పటి పత్రికలలో చాలా పత్రికలలో చాలా పత్రికలు వార్త పత్రికలుగానే ప్రచురితమయ్యేవి.

మొట్ట మొదటి అమెరికా న్యూస్ పేపర్ పబ్లిక్ అక్కరెన్స్‌స్‌ను 1690లో బోస్టన్‌లో ప్రారంభించారు. కానీ ఆ ప్రాంత గవర్నర్ దానిని వెంటనే నిలిపివేశారు. 'పెన్సిల్వేనియ గెజిట్' అనే పత్రికను బెంజిమెన్ ఫ్రాంక్లిన్ 1729 నుండి 1765 వరకూ నిర్వహించాడు. అమెరికా విప్లవ కాలంలో ప్రజలు పత్రికల కోసం ఎగబడేవారు. ఆ కాలంలో 37 వార్తా పత్రికలు ప్రచురితమయ్యేయి. 1785లో డెయిలీ యూనివర్శల్ రిజిస్టర్‌గా ప్రచురితమైన 'లండన్ టైమ్స్' పత్రికా కూడా ప్రముఖంగా చెప్పుకోదగ్గినది.





పింక్ జైలు

ఇంగ్లండ్‌లోని యార్క్‌షైర్‌లో హాడ్డర్స్ ఫీల్డ్ అనే ప్రాంతం వుంది. ఇక్కడ వున్న జైలునే 'బేకర్ మిల్లర్ పింక్ జైలు'గా వ్యవహరిస్తుంటారు. బేకర్ మిల్లర్ అనే పోలీసు చీఫ్ ఒకాయన ఈ జైలులో బాగా క్రూరులైన ఖైదీల కోసం ముదురు గులాబీరంగు గదినొకదాన్ని ఏర్పాటు చేశాడు. ఎక్కువ నేరాలకు పాల్పడిన ఖైదీలను పోలీసులు ఆ గదిలో వుంచుతుంటారు. ఈ గది రంగు వల్ల ఖైదీలలో మార్పు వస్తుందని, దాని ప్రభావం చాలా ఎక్కువగా వుంటుందని సైకాలజిస్టు కూడా అయిన మిల్లర్ ఈ విధంగా ఏర్పాటు చేశాడట. ఆయన పేరుమీదగానే ఈ జైలుకు బేకర్ మిల్లర్ పింక్ జైలు అని పేరొచ్చింది.

బెర్ముడా ప్రాంతంలో జీవించే చేపలు!!!

అట్లాంటిక్ సముద్రంలో బెర్ముడా ట్రయాంగిల్ ప్రాంత పరిధిలోకి వెళ్ళిన ఓడలు, విమానాలు, అదృశ్యమౌతున్న సంగతులు మనకు తెలుసు. అయితే ఈ ప్రాంతంలోనే నివశించగలిగే చేపల గూర్చి తెలుసుకుందాం. ఈల్ రకం చేపలు చాలా పొడవుగా వుంటాయి. ఇవి సముద్రంలో వందల మైళ్ళ దూరం ప్రయాణిస్తుంటాయి. అమెరికా, యూరప్‌లలో ఇవి చిన్న చిన్న వాగులలో కూడా కన్పిస్తుంటాయి. ఒక్కొక్క ఈల్ చేప సముద్రంలో 180 నుండి 275 మీటర్ల లోతున 2 మిలియన్ గుడ్లను పెడతాయి. అయితే ఇవి అట్లాంటిక్ మహాసముద్రంలోని బెర్ముడా సమీపంలో గుడ్లను పెట్టడమే ఇక్కడి విశేషం. ఇవి బూడిద లేదా నలుపు రంగుల్లో వుంటాయి. ఈల్ చేపల జీవ పరిణామాల క్రమాన్ని ఇటీవలనే గుర్తించడం జరిగింది. ఇది ఆ దశను క్రమంగా ఈల్ ఆకృతులలోకి వస్తాయి. ఇవి అట్లాంటిక్ మహాసముద్రంలో బెర్ముడా ప్రాంతంలో ఎక్కువగా కన్పిస్తాయి. గుడ్ల నుండి ఎల్వర్స్ దశకు చేరుకున్న మిలియన్ల కొద్దీ ఈల్ చేపలు బెర్ముడా ప్రాంతం నుండి యూరప్ వైపు ప్రయాణిస్తుంటాయి. అయితే అవి వాటికి మూడవ సంవత్సరం వచ్చే వరకూ యూరప్‌లోని నదుల్లోకి ప్రవేశించవు. అలాగే బెర్ముడా ప్రాంతం నుండి అమెరికా వైపు ప్రయాణించే ఎల్వర్స్ మాత్రం సంవత్సరం వయస్సు రాగానే అమెరికాలోని నదులు, వాగుల్లోకి చేరిపోతాయి. ఇవి సెయింట్ లారెన్స్ నది నుండి మెక్సికో గల్ఫ్ వరకూ కన్పిస్తాయి. నాలుగు నుండి పన్నెండు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకూ ఇవి నదుల్లో కాలం గడుపుతాయి. ఈ కాలంలో ఇవి 60 నుండి 90 మీటర్ల పొడవు పెరుగుతాయి. ఆ తరువాత అవి నదులను వదిలి మరలా బెర్ముడా వైపు ప్రయాణిస్తాయి. ఆ లోతుల్లో గుడ్లు పెట్టి అక్కడే మరణిస్తాయి. అట్లాంటిక్ తీరంలో ప్రతి సంవత్సరం 9 లక్షల కిలోలకు పైగానే ఈల్ చేపలను పడుతున్నారు.



కొత్త పుస్తకాలు

అధ్యయన కథకులకు ఆణిముత్యాలు

"పాలగుమ్మి పద్మరాజు రచనలు"

కాశీ విశ్వ విద్యాలయంలో చదివిన తన నాటి పలువురు తెలుగువాళ్ళ లాగానే పద్మరాజు కూడా గతితర్కం పునాది మీద శాస్త్రీయ సామ్యవాదాన్ని పద్మరాజు విశ్వసించాడు. రాయ్‌తో పరిచయం తర్వాత నవ్య మానవవాదిగా మారాడు. వీరి తెలుగు కథ గాలివానకు అంతర్జాతీయ గుర్తింపు ఆవార్డ్ వచ్చింది. ఈ కథ కూడా ఈ సంపుటిలో (పేజీ.118) చోటుచేసుకుంది. దాదాపు 59 కథలు మరో 7 అనువాద పాశ్చాత్య కవుల కథలు ఈ సంపుటిలో వున్నాయి. ఈ సంపుటిలో చివర ఐల్ ఐ కింగర్- జోసెఫ్ మార్జిన్ బార్- హన్స్ బెండర్ వుల్ఫ్ గాంగ్ బోర్కెర్ట్, హ్యూబర్ట్ ఫిక్టె, గెర్డ్ గేసర్, మాక్స్ వాన్‌డెర్ గ్రున్ లాంటి వారి క్లుప్త పరిచయం... చాలా బాగుంది.

"తనని గురించి పద్మరాజు" అనే 8 పేజీల వ్యాసం (అబవుట్ హిమ్ సెల్ఫ్" అనే ఆంగ్లవ్యాసం) యువకథా రచయితలకు చక్కటి పాఠంగా ఉంటుంది. 1938లోనే త్రివేణి పత్రికలో "సుబ్బి" ఇంగ్లీషులో అచ్చుకాబడిన తొలి కథ. భయంకరమైన తుఫాన్‌లో చిక్కుకున్న ఒక వ్యక్తి క్షోభను "గాలివాన" కథాంశంగా రాశారు.

పడవప్రయాణం (పేజీ68), కూలిజనం (పేజీ 76), ఫలశ్రుతి (పేజీ130), ఇల్లు అమ్మకం, (పేజీ 190), అడుగుజాడలు (పేజీ 240), రంగభూమి (పేజీ 245), మూత పడని తలుపులు (పేజీ266) లాంటి కథలు పాఠకుల్ని బాగా ఆకట్టుకొంటాయి. చాలా కథలు మధ్య తరగతి కుటుంబాల గురించే రాశారు. అయిదేళ్ళ చెల్లెలు సరళ జ్వరంతో చనిపోవడం.. తన కళ్ళ ముందు చావుని చూసిన రాముడి మానసిక స్థితి - అతని తల్లి గుండెకోతను నాల్గు పేజీల్లో ఎంతో గొప్పగా రాసారు. ఈ కథ 1938 మార్చి నెలలో "భారతి" లో ప్రచురణైంది. బాలసాహిత్యం రచనగా అనిపించినా చాలా మంచి కథ. సినిమా రంగంలోని మాయా మర్మాలపై "ఆశాజీవులు" కథ (పేజీ 434) రాసారు. పద్మరాజు నాడు రాసిన పరిస్థితులు నేటికీ వున్నాయి. నాడు మద్రాస్ ఐతే.. నేడు మహానగరం.. దొంగలు, పోలీసులు, కోర్టుల గురించిన కథ "కోర్టు పక్షి" (పేజీ 344) పాఠకుల్ని న్యాయంవైపు నడిపిస్తుంది. గ్రామీణ జీవితాలు.. పల్లె వాతావరణం.. చాలా కథల్లో కనిపిస్తుంది. రచయితగా తనకున్న కొన్ని స్థిరాభిప్రాయాలు తన రచనలకు లొంగలేదని బాధపడ్డ రచయిత పద్మరాజు... అన్ని కథలు.. పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి.

"పాలగుమ్మి పద్మరాజు రచనలు"
పేజీలు : 500,
వెల: రూ 250/-,
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన భవన్ - అబిడ్స్ -హైదరాబాద్- 1
అన్ని విశాలాంధ్ర బ్రాంచీల్లో.

చక్కటి కథాసంపుటి

1994 నుండి 2006 వరకు ప్రచురితమైన ముప్పై మూడు రచనలను ముచ్చటగా ఈ సంపుటిలో సంకలనం చేసారు. వ్యాసాలు, కథలు, సంగీత నాట్య రూపకం ఉన్నాయి. కేవలం కథలే ప్రచురిస్తే బాగుండేది. విశ్వనాథ వారి రచనా మార్గాన్ని గుర్తుతెచ్చాలా "కోటలో నారాజు" -రుద్రమదేవి వంటి చారిత్రక నవలలు రాసారీమె. ఆంధ్ర మహావిష్ణువు - ఆముక్త మూల్యద అనే ఈ కథలో చారిత్రక ధృక్పథం - అష్టదిగ్గజ కవుల భువన విజాయాన్ని చక్కగా రాసారు. సాంఘిక ఇతి వృత్తంతో సాగిన "పరమార్థం" కథ (పేజీ-9) నుండి తుమ్మెదలు శత్రువులను తరిమిన వీరగాథ నారసింహ శతకావిర్భావానికి సంబంధించినది - చారిత్రాత్మకమైన కథా కథనంతో ఈ సంపుటి సాగింది.

యామినీ పూర్ణ తిలక (పేజీ 138) గౌతమ బుద్ధుడి నాటి కల్పిత కథ. దాదాపు 20 కథల్లో మంచి వస్తువైవిధ్యముంది. హృదయార్ద్రత, సుస్పష్టమయిన విషయావగాహన, సాహిత్య వైదుష్యం, భాషా సారళ్యం, గూడు కట్టుకొన్న మంచి కథలు " అంటారు ముందుమాటలో డా౹౹ పోరంకి దక్షిణామూర్తి. ఈ సంపుటికి డా౹౹ పోతుకూచి సాంబశిరావు, డా౹౹ వి.ఎ.ఎల్ నరసింహారవు, ఎం. కులశేఖరరావు లాంటి సాహితీ పెద్దలు, పరిచయ వాక్యాలుగా తొలిపలుకులు రాసారు. కథా సంపుటిని రచయిత్రి తన భర్త సత్యవాడ మెకట సుబ్బారావుకి అంకితం ఇచ్చారు. పరిణతమైన రచనా శిల్పం కలిగి అటు సామాజిక స్పృహ, ఇటు ధార్మిక స్పృహలతో చారిత్రక కథాకథన నేపథ్యంలో చక్కటి కథాసంపుటిని ఇందిరాదేవి అందించారు.



(కథాసంకలనం)
రచయిత్రి : శ్రీమతి ఓగేటి (సత్యవాడ) ఇందిరాదేవి,
పేజీలు: 194
వెల - 150 / రూ,
ప్రతులకు: ఓగేటి పబ్లికేషన్స్, 3- 6- 470
పావనీ సత్యాకాంప్లెక్స్
6వ వీధి,103 వనంబర్, ఫ్లాట్
హిమాయత్ నగర్
హైదరాబాద్ 29.

- తంగిరాల చక్రవర్తి

యోగా బామ్మ

"దేనికైనా యోగం వుండాలి!"

"దేనికంటా?"

"ముందే చెప్పాం కదా. దేనికైనా"

"అది మాకూ తెల్సు. ప్రస్తుతం ఆ మాట అనడానికి సందర్భం ఏవిటా అని!"

"యోగాసనాలు వేయడానికే అనుకోండి... బామ్మగారు చూడండి ఎలా వీజీగా వేసేస్తోందో"

"నిజమే సుమీ. పైగా ఆవిడగారికి చాలా వయసున్నట్టుంది. ఈ వయసులో కూడా అవయవాలను ఎలా వంచేస్తోందోకదా"

"అసలు ఆమె వయసు ఎంతనుకుంటున్నారు?"

"ఎంత? మహా వుంటే అరవయ్యో డెబ్బయ్యో వుంటాయేమో"

"సర్సరి. బామ్మకు అక్షరాలా ఎనబైమూడేళ్లు"

"మరి అంత పెద్దావిడ ఇలా ...ఎలా?"

"అసలు ఆ బామ్మ గురించి చెప్పాలంటే చాలానే వుంది"

"చెప్పేసుకుంటే వినిపెడతాం... మొదలెట్టేయండీ..."

"యోగా బామ్మ పేరు బెట్టి కామన్. వయసు 83. ఆస్ట్రేలియాలోని విలియమ్స్‌టౌన్ వాసి. ప్రపంచంలోకెల్లా వృద్ధ యోగా మాస్టర్ ఈమే. డెబ్బైలలోనే 33 ఏళ్లపాటు యోగా కేంద్రాలు నిర్వహించింది. పలురకాల టీవీ షోలలో దర్శనమిచ్చింది. ప్రస్తుతానికి వస్తే ... ఈ వయసులో మామూలువాళ్లైతే మంచంలో పడుకొని ముక్కుతూ మూల్గుతూ వందరకాల నొప్పులు చెప్తారు. ఈ బామ్మ అలా కాదు. వారానికి 11 యోగా క్లాసులు తీసుకుంటుంది. అంతేనా! యోగాసనాలకు సంబంధించి ఏకంగా మూడు పుస్తకాలే రాసేసింది. మయూరాసనం, కమలాసనం వేయడమంటే మాటలుకాదు. అవన్నీ బామ్మగారు సునాయాసంగా చేసేస్తుంది. ఇంకా బామ్మ గురించిన వివరాలేమైనా కావాలా!"

"ఇంకా ఏం కావాలండీ...ఇంత డీప్‌గా చెప్పాక...!"

✪

అలీబాబా 40 దొంగలు

కథా నిలయం

జరిగిన కథ :

అలీబాబా అడవిలో ఎండుకట్టెలు ఏరుకుంటూ జీవించేవాడు. ఎప్పటిలాగే కట్టెలకోసం వెళ్లిన అతనికి ఓ రోజు దొంగల ముఠా స్థావరం కనిపిస్తుంది. ధైర్యం చేసి లోపలికెళ్లిన అతనికి గుట్టలుగుట్టలుగా బంగారం, డబ్బు కనిపిస్తుంది. చూచి ఆశ్చర్యపోతాడు అలీబాబా. వాటిని గోతాల నిండా నింపుకుని ఇల్లు చేరతాడు. అయితే ఈ విషయాన్ని అతని వదిన కనిపెడుతుంది. అయాచితంగా డబ్బేదో వచ్చిపడిందని గ్రహిస్తుంది. భర్త ద్వారా అసలు విషయం తెలుసుకుంటుంది. అతనిని కూడా దొంగల స్థావరానికి పంపుతుంది. అయితే అనుకోని పరిస్థితుల్లో అతను దొంగల చేతిలో హతుడవుతాడు. అలీబాబా ఎలాగోలా తన అన్న శవాన్ని తీసుకొచ్చి ఖననం చేస్తాడు. తమ సొత్తును కాజేసిన వాణ్ణి కనుగొనటానికి ఓ దొంగ మారువేషంలో బయలుదేరతాడు. ఆ తర్వాత....

✦ ✦ ✦

మారువేషంలో వున్న దొంగ వరుసగా ఊళ్లన్నీ తిరుగుతూ... తిరుగుతూ.... అలీబాబా నివసించే ఊళ్లోకి ప్రవేశిస్తాడు. ఆ ఊళ్లో కొత్తగా డబ్బు సంపాదించిన వారిని కనుగొనడం అతని ప్రధాన కర్తవ్యం. అందుకే నలుగురూ వచ్చి చేరి పిచ్చాపాటి మాట్లాడుకునే ప్రదేశాలను ఎంచుకుని కాలక్షేపం చేయసాగాడు. అలా ఓ దర్జీ ఇంటికి వెళ్లి వసారాలో కూర్చుంటాడు. కాలు మడవకుండా ఎండనపడి తిరగడం వల్ల నాలుక పిడచకట్టుకుపోతుంది. దాంతో దర్జీని మంచినీళ్లిమ్మని అడుగుతాడు. దానికతను నవ్వుతూ

"మంచినీళ్లేం ఖర్మ, చల్లటి మజ్జిగే ఇస్తాను. దప్పిక తీర్చుకోండి" అంటూ గ్లాసు నిండా మజ్జిగ అందిస్తాడు.

ఎండలో పడి ప్రయాణం చేసిన దొంగకు ఆ మజ్జిగ తాగడంతో ప్రాణం లేచొచ్చినట్టవుతుంది. అతను సంతోషంగా

"మీ వ్యాపారం బాగా సాగాలని, లాభాలొచ్చి నాలాంటి మరింతమంది ప్రయాణీకులకు చల్లటి మజ్జిగ ఇస్తుండాలని ఆ అల్లాను మరీ మరీ ప్రార్థిస్తున్నాను" అని బయలుదేరతాడు.

అయితే అప్పుడు దర్జీ కలుగజేసుకుని "ఈ గుడ్డలు ఎన్ని కుట్టుకుంటే ఏం లాభం వస్తుంది? నా కూటికి, గుడ్డకు కూడా రాదు. పస్తులుండాల్సిందే. అసలే ఈమధ్య కరువు మూలంగా జనాలు బట్టలు కుట్టించుకోవడమే మానేశారు. ఏదో మొన్నటిలాగా అదృష్టం తలుపు తడితే కానీ ఇలా దాన ధర్మాలు చేయలేం" అంటాడు ఆకాశంలోకి రెండు చేతులూ చూయిస్తూ.

అతని మాటలు దొంగకు ఆశ్చర్యాన్ని, అనుమానాన్ని కలిగిస్తాయి. వెంటనే వెనక్కుతిరిగి

"ఏంటా అదృష్టం! నాకు చెప్పకూడదా?" అంటాడు.

"అబ్బే అదేంలేదు" అంటాడు దర్జీ కంగారుగా.

"లేదు! ఏదో వుంది. చెప్పకపోయావో నీ మొండెం మీద తల వుండదు. చెప్తే కనక నీకు చేతి సంచి నిండా బంగారు నాణేలు ఇస్తాను" అంటూ కత్తితో బెదిరిస్తాడు.

"నిజం చెప్పకపోతే ప్రాణమే పోతుంది. అదే చెప్తే బంగారు నాణేలు సొంతమవుతాయి. రెండో పని చేస్తేనే లాభం కదా" అనుకుని విషయం అంతా మొదలెట్టి చెప్తాడు. ఒక వ్యక్తి రావడం, ఓ మొండేనికి మెడ అతకబెట్టి కుడితే తనకు బంగారు నాణేలు ఇస్తాననడం... అంతా చెప్తాడు.

ఆ మాటలకు దొంగకు ఎక్కడలేని హుషారు వస్తుంది. తమ సొత్తును కాజేసింది ఖచ్చితంగా వాడేననుకుంటాడు. అతని ఇల్లు ఎక్కడో చెప్పమంటాడు.

మళ్లీ సమస్య మొదలవుతుంది దర్జీకి. ఆ విషయం అతనికే తెలీదు. అదే చెప్తాడు దొంగకు. అయితే అతను నమ్మకపోగా మళ్లీ కత్తి తీసి దర్జీ మెడ దగ్గర ఆనించి అడుగుతాడు.

"నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆరోజు కళ్లకు గంతలు కట్టి నడిపించుకెళ్లారు. అతని ఇంటికెళ్లాకే గంతలు తీసేశారు" చెప్తాడు దర్జీ.

దొంగ వెంటనే దర్జీ కళ్లకు గంతలు కట్టి ఆ ఇంటికి పదమంటాడు. అలా నడుచుకుంటూ నడుచుకుంటూ అలీబాబా ఇంటి దగ్గరకు చేరతాడు దర్జీ. అదే ఇల్లని చూపిస్తాడు. దొంగ సంతోషంగా ఆ ఇంటి తలుపు మీద ఒక గుర్తు పెట్టుకుంటాడు. తన వాళ్లందరికీ ఆ విషయం చెప్పి తన గొప్పతనాన్ని నిరూపించుకోవాలన్న ఆరాటంలో అశ్వాన్ని అధిరోహించి శరవేగంగా వెళ్లిపోతాడు.

అయితే అలీబాబా భార్య ఇదంతా గమనిస్తుంది. తమ ఒక్క ఇంటిమీదే ఆ గుర్తు ఎందుకు పెట్టాడో ఎంత ఆలోచించినా అర్థం కాదు. కానీ ఏదో ప్రమాదమైతే రాబోతుందని గ్రహిస్తుంది. దాన్నుంచి తప్పించుకోవడానికి ఒక ఉపాయం ఆలోచిస్తుంది. తమ తలుపు మీద వున్నటువంటి గుర్తునే ఊళ్లో అన్ని ఇళ్లకు పెడుతుంది.

(ఆతర్వాత ఏమౌతుంది? అలీబాబా ఇంటిని దొంగ గుర్తుపడతాడా? దొంగల నాయకుడు ఏమంటాడు? వంటి విషయాలు తెలియాలంటే ఏడు రోజులు తర్వాత ఇదే పేజీలో చూడండే. అందకా సెలవా మరి)

పునఃకథనం: కె. చరిత